

# మనం ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం-మహబూబాబాద్

శుక్రవారం | 25 | ఆగష్టు | 2023 | పేజీలు : 9


## గాంధీ చిత్రాన్ని వీక్షించిన 29373 మంది విద్యార్థులు : డిఇఓ

**ఖమ్మం, ఆగస్టు 24(మనం బ్యూరో):** జిల్లాలో గాంధీ చలన చిత్రాన్ని 29373 మంది విద్యార్థినీ విద్యార్థులు, 1211 మంది ఉపాధ్యాయులు వీక్షించారని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా కలెక్టరు, అదనపు కలెక్టర్ సూచనలు, మార్గనిర్దేశకంలో ఈనెల 16 నుండి 24 వ తేదీ వరకు జిల్లాలోని 17 సినిమా థియేటర్లలో ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1–30 గంటల వరకు గాంధీ చలన చిత్రాన్ని ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల విద్యార్థినీ విద్యారులు తిలకించారని తెలిపారు. సినిమా ప్రదర్శనలకు సంబంధించి థియేటర్లలో అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరిగిందని, బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థులను స్కూళ్ల నుండి థియేటర్లకు, తిరిగి స్కూళ్ళకు చేర్చడం జరిగిందని, సినిమా ప్రదర్శనలు అన్ని థియేటర్లలో ప్రశాంతంగా జరిగాయని ఆయన తెలిపారు. థియేటర్ల యాజమాన్యాలు, రెవిన్యూ, పోలీస్, మున్సిపల్, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలు గాంధీ చలన చిత్ర ప్రదర్శనలు జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు తోడ్పాటునందించారని జిల్లా విద్యా శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# దివ్యాంగులను స్వశక్తులను చేసేందుకు పించన్ల పెంపు

**– రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**
**– జిల్లాలో 13770 మంది దివ్యాంగులకు లబ్ధి**
**– జిఎంపిఎస్ ల క్రమబద్ధీకరణ కారుణ్య నియామకాలు**
**–జిఓ నెం.58 క్రింద ఇంటి స్థలాలు క్రమబద్దీకరణ పట్టాలు పంపిణి**





**భద్రాద్రి కొత్తగూడెం, ఆగష్టు 24 (మనం ప్రతినిధి) :** దివ్యాంగులను స్వశక్తులను చేసేందుకు జూన్ మాసం నుండి పించన్లు పెంచినట్లు రాష్ట్ర రవాణశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. గురువారు ఐడిఓసి కార్యాలయపు సమావేశపుహాలులో నిర్వహించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ, కారుణ్య నియామకాలు, జిఓ నెం .58 క్రింద ఇంటి స్థలాలు క్రమబద్దీకరణ పట్టాలు పంపిణి, ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా ఇంటి పట్టాలు పంపిణి , దివ్యాంగులకు 3016 నుండి 4016 లకు పెంచిన మంజూరు పత్రాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు . ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 13770 మంది దివ్యాంగులకు పెంచిన పించన్లు ద్వారా లబ్దిపొందుతున్నారని చెప్పారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను రెండు కళ్లుగా భావించి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. స్వయం పరిపాలనలో ఎంతో అద్భుతంగా పనిచేస్తున్నామని సుపరిపాలన ఫలాలను ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. పోడు సమస్య పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల మందికి పోడు పట్టాలు అందిస్తే మన జిల్లాలోనే 1.50 లక్షల మందికి పైగా పోడు పట్టాలు అందించామని చెప్పారు . జిల్లాకు నూతన కలెక్టర్ గా వచ్చినప్పటికీ గోదావరి వరదల్లో ప్రజలకు విశేష సేవలు అందించినట్లు ముఖ్యమంత్రి అభినందించారని, వరద సహాయక చర్యలు భేష్ అని మంత్రి జిల్లా కలెక్టర్ను అభినందించారు. మూడో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించినప్పటికీ ప్రజలకు ఎలాంటి ప్రాణహాని రాకుండా , ముంపు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించుటలో మీ సేవలు అభినందనీయమని మంత్రి అభినందించారు.

**జె పి ఎస్ ల క్రమబద్దీకరణ : కలెక్టర్ డాక్టర్ ప్రియాంక**

జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల మాట్లాడుతూ జిల్లాలోని 481 గ్రామ పంచాయతీల్లోని 349 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పని చేస్తున్నారని వారిలో 261 మంది 4 సంవత్సరాలు సేవా కాలం పూర్తి కాగా ఎవాల్యుయేషన్ పూర్తి చేసిన 100 మందిని క్రమబద్దీకరించినట్లు చెప్పారు . వివిద ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ, మరణించిన 26 మంది కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు ద్వారా జూనియర్ సహాయకులు ఉత్తర్వులు అందచేసినట్లు చెప్పారు జిఓ నెం 58 ద్వారా ఎంపిక చేసిన 154 మందిలో 15 మందికి క్రమబద్దీకరణ పట్టాలు పంపిణీ చేశామని మిగిలిన 139 పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న ఎస్సీలకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు విచారణ నిర్వహించామని వారిలో 37 మందికి క్రమబద్ధీకరణ పట్టాలు జారీ చేస్తున్నామని , 968 మంది దరఖాస్తులు ప్రక్రియ పురోగతిలో ఉన్నట్లు చెప్పారు . జిల్లాలో 119231 మందికి పించన్లు రూపేణా ప్రతి నెలా 27.33 కోట్లు చెల్లిస్తున్నామని వారిలో 13770 మంది దివ్యాంగులకు ప్రభుత్వం పెంచిన పింఛన్లు 4016 లు మంజూరు పత్రాలు అందచేసినట్లు చెప్పారు . అనంతరం జూనియర్ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు , కారుణ్య నియామకాలు పొందిన వారికి , జిఓ నెం . 58 ద్వారా , ఎస్సీలకు ఇంటి పట్టాలు , దివ్యాంగులకు పెంచిన పించన్లు పత్రాలను మంత్రి పువ్వాడ అందచేశారు . ఈ సమావేశంలో కొత్తగూడెం , ఇల్లందు 8లో..

# సంక్షేమ కార్యక్రమాల లక్షా ్యలను సాధించాలి

## అధికారులతో కలెక్టర్ గౌతమ్ సమీక్ష

**ఖమ్మం, ఆగష్టు 24(మనం బ్యూరో):** ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత సమయంలో సాధించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. గురువారం నూతన కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో హరితహారం, గృహలక్ష్మి, బి.సి, మైనారిటీలకు ఆర్థిక చేయూత, రెండో విడత దళిత బంధు లబ్ధిదారుల ఎంపిక తదితర పథకాల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ నెల 26న చేపట్టనున్న మాస్ హరితహారం కార్యక్రమంలో భాగంగా తెలంగాణాలో కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లాకు కేటాయించిన లక్ష్య సాధనకు కార్యచరణ చేపట్టాలన్నారు. గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి అర్హుల జాబితాను రూపొందించాలన్నారు.

బి.సి, మైనారిటీలకు ఆర్థిక చేయూత పథకాన్ని అమలుకు కార్యచరణ చేయాలన్నారు. రెండవ విడత గొర్రెల పంపిణీ క్రింద మంజూరైన యూనిట్ల సేకరణ వేగవంతం చేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. దలిత బందు పథకం కింద నియోజకవర్గానికి 11 వందలమంది లబ్ధిదారుల ఎంపికలో నివాస ధ్రువీకరణ, ఆధార్ కార్డు వివరాలను పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పి సిఇఓ వి.వి.అప్పారావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిణి విద్యా చందన, పశుసంవర్ధక జాయింట్ డైరెక్టర్ వేణుమనోహర్, ఈ.డి. ఎస్.సి. కార్పొరేషన్ నవీన్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జ్యోతి, జిల్లా వెల్ఫేర్ అధికారి సుమ, డి.ఆర్.డి.ఎ. ఏ.పి.డి శిరీష, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



**భద్రతా చర్యలు చేపట్టాలి**

అప్రమత్తంగా ఉంటూ, భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టర్ జిల్లా ప్రజాపరిషత్ ప్రాంగణంలోని ఇవిఎం గోడౌన్ ని తనిఖీ చేశారు. గోడౌన్ తాళాలు, సీళ్ళు, సిసి కెమెరాలు పరిశీలించారు. అనంతరం జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ రిజిస్టర్ అయిన రాజకీయ పార్టీలకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ ని నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి ప్రతినిధులకు చేరవేయాలని, ఏవైనా తప్పులుంటే దృష్టికి తేవాలని అన్నారు. 1 అక్టోబర్ కటాఫ్ తేదీ అని, ఆ రోజుకు 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరు ఓటరుగా 8లో..



## బిసి లబ్ధిదారుల చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ల మధ్య వాగ్వివాదం

**భద్రాచలం, ఆగస్టు 24( మనం న్యూస్ ):** భద్రాచలం ఆర్డీవో ఆఫీస్ లో బీసీ లబ్ధిదారుల చెక్కుల పంపిణీ విషయమై రసాభాసగా మారింది. బీసీ బంధు లబ్ధిదారుల ఎంపికలో విషయమై తనకు సంప్రదించకుండా ఎంపిక చేయటం పట్ల స్థానిక అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ ని స్థానిక ఎంఎల్ఏ పొదెం వీరయ్య హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులైనా తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా లబ్ధిదారులు ఎంపిక చేయడం సరైంది కాదన్నారు. ఇదే సందర్భంలో అధికారులు రేఖ కాంతారావుని మాట్లాడాలని కోరడంతో ఎంఎల్ఏ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేగా కాంతారావు మైక్ తీసుకొని మాట్లాడే సమయంలో ఎంఎల్ఏ కల్పించుకుని తాను అడిగిన అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాలని అధికారులు నిలదీశారు. ఈ క్రమంలో రేగా కాంతారావు నుంచి మైక్ లాక్కోవడంతో రభస ప్రారంభమైంది .ఇదే విషయమై కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్యకర్తలు 8లో..

# గడపగడపకు కాంగ్రెస్ అనే నినాదంతో విస్తృతంగా పర్యటించిన డాక్టర్ రవి





**ఇల్లందు, ఆగస్టు 24 (మనం న్యూస్):** ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ జి రవి గురువారం ఇల్లందు నియోజక వర్గం బయ్యారం మండలం గురిమెళ్ళ గ్రామపంచాయతీలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గురిమెళ్ళ గ్రామపంచాయతీలో ప్రతి గడపకు తిరుగుతూ ప్రజలతో మమేకమై వారికి ప్రియతమ నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ , టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి , సీఎల్పీ నేత భట్టి విక్రమార్క 2023 లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో సబ్బండ వర్గాలకు ప్రకటించిన మేలును గురించిన (డిక్లరేషన్ )సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ 2023 లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతన్నలకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ, భూమి లేని రైతు కూలీలకు సంవత్సరానికి 12 వేల ఆర్థిక సహాయం, ధరణి పోర్టల్ రద్దుచేసి పోడు భూములకు పట్టాల పంపిణీ, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్, మహిళలకు పావలా వడ్డీ రుణాలు, చేయూత పథకం కిందవృద్ధులు.వికలాంగులు ,వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు చేనేత కార్మికులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు, డయాలసిస్ రోగులకు నెలకు 4000 రూపాయల పెన్షన్ ఇస్తుందని తెలిపారు. తెల్ల కార్డున్న ప్రతి కుటుంబానికి 5 లక్షల వరకు అన్ని జబ్బులకు ఆరోగ్య శ్రీ పథకం కింద ఉచిత వైద్యం, ఇల్లు లేని ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం ఇందిరమ్మ ఇల్లుల మంజూరు, ప్రతి పేద కుటుంబానికి 9 రకాల నిత్యావసర సరుకుల (రేషన్) పంపిణీ , నిరుద్యోగులకు నెలకు 4000 రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులందరికీ ఫీజు రియంబర్స్మెంట్, తెలంగాణ అమరవీరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, నెలకు 25 వేల పెన్షన్, 18 సంవత్సరాలు పైబడి చదువుకునే ప్రతి యువతీకి ఎలక్ట్రిక్ స్కూటర్ అందజేత, కేజీ టు పీజీ ఉచిత విద్య , తదితర సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందని వారు ప్రజలకు వివరించారు. 2023 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బాబురావు, సునీల్ ,బోడా అశోక్ విక్రమ్ ,ఎర్రయ్య, వజ్జ రంజిత్, అజయ్ కుమార్, వీరన్న, క్రాంతి కుమార్,ఇల్లందు పట్టణ మాజీ కౌన్సిలర్ ధారావత్ కృష్ణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ బిఎన్ గోపాల్, పసిక తిరుమల్, ఇల్లందు పట్టణ కాంగ్రెస్ కమిటీ బీసీ సెల్ అధ్యక్షులు ఆనంద్,రవి , ఇల్లందు పట్టణ కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పాషా,తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సేవ చేయడంలోనే ఆనందం...

## –కరకగూడెం ఎస్ఐ రాజారాం
## –ఏజెన్సీలో ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం
## –వరద బాధితులకు బియ్యం పంపిణీ



**కరకగూడెం, ఆగస్టు 24 (మనం న్యూస్):** సమాజం లోని అభాగ్యులకు ప్రతీ ఒక్కరూ ఎదో రూపంలో ఆసరా అవ్వాలని కరకగూడెం ఎస్సై రాజా రామ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని నర్సంపేట ఎస్సీ కాలనీ,తాటిగూడెం గ్రామాలకు చెందిన వరద బాధితులకు వారి గ్రామాల్లో ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు కరకగూడెం గ్రామీణ వైద్యులు షేక్ సోందుపాషా సమక్షంలో ఎస్సై చేతుల మీదుగా సుమారు 50 కుటుంబాలకు 25 కేజీల చొప్పున 12.50 క్వింటాలబియ్యంను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రతీ ఒక్కరూ సేవాగుణంను అలవర్చుకోని సేవే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.అంతేకాకుండా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ వారి సేవలు అభినందనీయంమని కొనియాడారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు షేక్ సోందుపాషా మాట్లాడుతూ.. పేదలకు ఎల్లప్పుడూ సాయపడడంమే తమ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశ్యంమని అన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఫౌండేషన్ సభ్యులు, పాల్గొన్నారు.

# ఓటు హక్కును వినియోగించుకోవాలి



**ఆళ్లపల్లి, ఆగస్టు 24 (మనం న్యూస్):** ఈవీఎంల ద్వారా ఓటు హక్కు ఎలా ఉపయోగించుకోవాలో అని ఎంపీడీవో రామారావు ఆధ్వర్యంలో మండలంలో అవగాహన సదస్సు నిర్వహించారు.రామాంజి గూడెం గ్రామ పంచాయతీలో గ్రామస్తులకు ఓటు ఎలా వేయాలో తమ సంబంధిత అభ్యర్థికి ఓటు పడినదా లేదా అని ఎలా తెలుసుకోవాలో అనే విషయంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు సందర్భంగా వారు మాట్లాడుతూ పినపాక అసెంబ్లీ నియోజకవర్గం అవగాహన ప్రచార రథం భాగంగా మండలంలోని 12 గ్రామ పంచాయతీలలో ఉన్న ఓటర్లకు 22 నుంచి 4 తారీఖు వరకు ఓటు హక్కు ఎలా ఉపయోగించుకోవాలి వేసిన ఓటు సంబంధిత అభ్యర్థికి పడినదే లేదా అనే విషయాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం గ్రామ పంచాయతీల వారిగా నిర్వహించబడుతుందని తెలిపారు. 18 సం నుంచి 25 సంవత్సరాల వయసు వారు ఫారం 6లో కొత్తగా ఓటు నమోదు చేసుకోగలరు ఫారం 8లో ఏమైనా అడ్రస్ మారితే అవి సంబంధిత బిఎల్ఓ కు అందజేయగలరని తెలిపారు.

# గోదావరి వరద బాదితుల పోరాటానికి సంపూర్ణ మద్దతు

## బిఎస్పీ పార్టీ జిల్లా ఇన్ చార్జ్ తడికల శివకుమార్



**చర్ల, ఆగస్ట్ 24 (మనం న్యూస్) :** చర్ల మండలం లోని వరదముంపుకు గురయ్యే గ్రామాల ప్రజలు చర్ల మండల పరిధిలోని విజయకాలనీ,లక్ష్మికాలనీ పరిదిలో రెవిన్యూ భూభాగం కేటాయించాలని చేస్తున్న ఆందోళన కార్యక్రమానికి బహుజన సమాజ్ పార్టీ పూర్తి గా మద్దతు ఇస్తుందని బిఎస్పీ జిల్లా ఇన్ చార్జ్ తడికల శివకుమార్ అన్నారు. ఏళ్ల తరబడి ముంపుకు గురవుతున్నా శాశ్వత నివాసాలకు భూమిని కేటాయింపు చేయకుండా తాత్సారం చేస్తున్న ప్రభుత్వాన్ని అసమర్ధ చేతగాని ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు. 1/70 యాక్ట్ కు ముందే ఎస్సీ కాలనీలకు కేటాయించిన117 సర్వే నంబర్ భూమిని ఇతరులకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఈ ఉద్యమం ఉదృతం అవకముందే ప్రభుత్వం వరద బాదితులకు న్యాయం చేస్తూ ఎత్తైన ప్రదేశం లోని ప్రభుత్వ భూమిని కేటాయించి జిఓ విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో బిఎస్పీ మండల అధ్యక్షుడు కూరపాటి వీర్రాజు ,కొప్పుల నారాయణ ,తడికల రవికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వేముల



**అశ్వారావుపేట టౌన్, ఆగష్టు 24(మనం న్యూస్ ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలంగాణ కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా వేముల ప్రతాప్ బాధ్యతలు వహించారు కొత్తగూడెం పట్టణంలో ఉన్న కాంగ్రెస్ డిసిసి కార్యాలయంలో గౌరవనీయులు కాంగ్రెస్ సీనియర్ నేత సేవాదళ్ జిల్లా అధ్యక్షులు అయిన అంగోతు నవోదు నాయక్ చేతులు మీదుగా అధికారిక పత్రాన్ని అందుకున్నారు మరియు అశ్వారావుపేట మండల సేవాదళ్ అధ్యక్షునిగా ఎండి రహమద్ కు బాధ్యతలు అప్పగించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ కష్ట కాలంలో పార్టీకి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసిన ఒక్కరిని పార్టీ గుర్తుంచుకొని పార్టీ పదవులు ఇవ్వడం జరిగిందని కాంగ్రెస్ పార్టీలో పనిచేసినటువంటి ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తుపెట్టుకుని వారికి అన్ని విధాలుగా సహకరిస్తుందని ఆయన అన్నారు అదేవిధంగా రానున్న రోజుల్లో పక్క రాష్ట్రమైన కర్ణాటక మాదిరిగానే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆయన భావాన్ని వ్యక్తం చేశారు, అనంతరం ఈ బాధ్యతలు అందుకున్న వేముల ప్రతాప్ ఎండి రహమద్ లు వారికి ధన్యవాదాలు తెలియజేశారు.



# పాలేరు కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం రాయల దరఖాస్తు

## 200 కార్లతో తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు




**తిరుమలాయపాలెం, ఆగస్టు 25 (మనం న్యూస్) :** పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం కోసం టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాలుగు మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హైదరాబాద్ తరలివెళ్లారు. తొలుత తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కేసీఆర్ చెప్పే మోసపు మాటలు ప్రజలు నమ్మడం లేదని ఆయన తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నం రాజశేఖర్, పోట్ల కిరణ్, జూలకంటి సాగర్ రెడ్డి, గోళ్ళ లింగయ్య, పత్తి నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, ఎంపీటీసీ పాపా నాయక్, మాజీ సర్పంచ్ సండ్ర వెంకటేశ్వర్లు వివిధ గ్రామ కాంగ్రెస్ వెంకట్ రమణ ఎల్లయ్య నాయకులు ఆశీర్వాదం ఖాదర్ నిజం భద్రు మోతీలాల్ దుబాకుల ప్రదీప్ హనుమంతు పతన మల్లయ్య మాల్సూర్ ఎన్ యస్ యు ఐ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు జి.మోహన్ యూత్ కాంగ్రెస్ మండల కో ఆర్డినేటర్ బత్తుల రమేష్ సోషల్ మీడియా మండల చైర్మన్ చందు యూత్ కాంగ్రెస్ మండల నాయకులు నాగేష్ రాజేందర్ సాయి గురుమూర్తి రమేష్ వేణు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# లింగాలలో 10 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం



**కల్లూరు, ఆగస్టు 24 (మనం న్యూస్):** మండల పరిధిలోని లింగాల గ్రామ పంచాయతీ నందు యర్రబోయినపల్లి ఆర్ అండ్ బి రోడ్డు లో శివాలయం గుడి నుంచి వీరభద్ర స్వామి గుడి వరకు ఎస్ డి ఎఫ్ నిధులు 10 లక్షల రూపాయలతో 185 మీటర్ల పొడవు గల సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు బిఆర్ఎస్ నాయకులు దేవరపల్లి భాస్కరరావు తెలిపారు. శివాలయం నుండి వీరభద్ర స్వామి గుడికి వెళ్లే దారి అధ్వానంగా ఉంటూ ఎప్పుడు బురదమయంగా ఉండటంతో స్థానిక ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దృష్టికి తీసుకెళ్లగా పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి భక్తుల సౌకర్యార్థం ఎస్ డి ఎఫ్ నిధుల నుంచి పది లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. గుడికి వెళ్లే దారిలో సి సీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో గ్రామస్తులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేయించి గ్రామ అభివృద్ధికి తోడ్పడిన ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మట్టూరి శ్రీనివాసరావు, మట్టూరి సుబ్బారావు, ఏపూరి సాంబశివరావు, ఏపూరి మురళి, మద్దినేని భద్రయ్య, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనన్న అనుచరులెవ్వరూ బిఆర్ఎస్‌లో చేరడం లేదు

## అవాస్తవ ప్రచారాలు మానుకోండి : డా.కోట రాంబాబు



**మధిర, ఆగస్ట్ 24(మనం న్యూస్):** మధిర లోని గత మూడు రోజులుగా పొంగులేటి శ్రీనన్న ప్రధాన అనుచరుడు తన అనుచరులతో బీఆరెఎస్ పార్టీలో చేరుతున్నారని వస్తున్న వార్తలలో ఎటువంటి వాస్తవం లేదు అని డా.కోట రాంబాబు తెలిపారు. పొంగులేటి శ్రీనన్న మాట నియోజకవర్గ నాయకులు అందరూ తప్పక పాటిస్తూ కాంగ్రెస్ పార్టీ సూచించిన అభ్యర్థి గెలుపు కోసం కష్టపడి పనిచేసి గెలిపించుకుంటామని అన్నారు. బలం లేక ఓడిపోతాం అని అధికార పార్టీ నాయకులు కొందరు ఈ దుష్ప్రచారాలను చేస్తున్నారని ప్రజలు ఎవరూ కూడా వీటిని నమ్మొద్దు అని తెలిపారు. ఈ ప్రెస్ మీట్ లో దేవిసెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, కటికల సీతరామిరెడ్డి, బండి వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ కాశీ కోటేశ్వరరావు, నండ్రు విజయారావు, కపిలవాయి సత్యనారాయణ రాజు, బాహాటం శ్రీనివాస రాజు, అక్కినపల్లి నాగేశ్వరరావు, చిలకా సత్యం, నరసింహారావు, ఒబుల లక్ష్మారెడ్డి, షేక్ జహంగీర్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ సీనియర్ నాయకులు కందాళ 3వ వర్ధంతి



**తిరుమలాయపాలెం, ఆగస్టు 25 (మనం న్యూస్) :** మండలంలోని రాజారం గ్రామంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు కందాల నరసింహారెడ్డి మూడవ వర్ధంతి న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కామ్రేడ్ కందాల నరసింహారెడ్డి జీవితం విప్లవోద్యమంలో అమోఘమైందన్నారు. అయన ఆశయాలను ముందుకు తీసుకు పోవటం కోసం సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి పోరాటం నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ డివిజన్ నాయకులు వీరస్వామి, చంద్రారెడ్డి,మల్సూరు, వెంకటరెడ్డి, ఎలమంచి, భిక్షం, జగన్ తదితరులు పాల్గొన్నారు

# ఓబీ కార్మికులకు ఏరియా ఆస్పత్రిలో వైద్యం అందించాలి

## ఎస్ఓటూ జీఎంకు ఐఎన్‌టియూసీ ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల వినతి



**మణుగూరు, ఆగస్టు 24 (మనం న్యూస్) :** మణుగూరు ఏరియా సింగరేణి కాలరీస్ లో మహాలక్ష్మి, దుర్గా, వీపీఆర్ ఓ బీ కంపెనీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కంపెనీ యాజమాన్యం చెల్లించే మస్టర్ కు వైద్య ఖర్చులకు రూ.10-11 చెల్లిస్తున్నారని, పెరిగిన వైద్య ఖర్చుల నేపథ్యంలో కంపెనీ వారు చెల్లిస్తున్న డబ్బులు ఎటూ సరిపోవడం లేదని, సింగరేణి ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలందించే విధంగా ఓబీ కార్మికులకు ఆస్పత్రి పుస్తకాలు అందించాలని కోరుతూ ఐఎన్ టీ యూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు వెలగపల్లి జాన్, గౌరవ సలహాదారు పుచ్చకాయల శంకర్ ల ఆధ్వర్యంలో ఎస్ ఓ టూ జీ ఎం కృష్ణయ్య కు గురువారం జీఎం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్ టీ యూ సీ నాయకులు మాట్లాడుతూ ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల వయసుకు మించిన శ్రమ చేస్తూ సింగరేణిని లాభాల బాట పట్టిస్తూ కొందరు అనారోగ్యంతో బాధపడుతున్నారని అన్నారు. వచ్చిన నెల వారి కొద్ది పాటి జీతాలను ఆస్పత్రులకు ఖర్చు పెడుతూ అప్పుల పాలవుతూ ఆర్థిక ఇబ్బందులూ పడుతున్నారనీ వివరించారు. విపరీతంగా పెరిగిన వైద్య ఖర్చులకు డబ్బులు పెట్టలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబ సభ్యులను, వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని వారికి సింగరేణి కంపెనీ ఆస్పత్రిలో వైద్యం చేయించుకునే విధంగా పుస్తకాలు అందించాలని కోరారు. స్పందించిన ఎస్ ఓ టూ జీఎం ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సామా శ్రీనివాసరెడ్డి, నామా వెంకటేశ్వర రావు, రాజలింగు, ఉప్పన్న, ప్రశాంత్, శ్రీధర్, నగేష్ నాయుడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ కార్మికులు బిక్షటన



**తిరుమలాయపాలెం, ఆగస్టు 25 (మనం న్యూస్) :** భగీరథ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని గురువారం మిషన్ భగీరథ కార్మికులు బిక్షటన కార్యక్రమాన్ని నిర్వహించారు. మిషన్ భగీరథ అధికారి ఆఫీస్ నందు నాలుగవ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. అయినా అధికారులు మిన్నకుండడంతో కొత్త బస్టాండ్ దగ్గర బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, మిషన్ భగీరథ నాయకులు తిరుమల చారి మాట్లాడుతూ సమస్యలు త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో పాల్గొన్నవారు మిషన్ భగీరథ ఖమ్మం జిల్లా అధ్యక్షులు అన్నం వెంకయ్య, ప్రధాన కార్యదర్శి పాపగంటి రాంబాబు, వేల్పుల అనంతరాములు, గోడ్ల నరసింహారావు, పల్ల మధుసూదన్ రెడ్డి, అనుబోతు బాలకృష్ణ జక్కుల యాదగిరి అబ్బురి రవి వంశీ ఉపేంద్ర రాధాకృష్ణ వెంకటేశ్వర్లు బాలాజీ తిరుపతిరావు మల్లేష్ రాంబాబు సతీష్ మొదలగు కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఓటర్లందరూ జాబితాను తనిఖీ చేసుకోవాలిః తహశీల్దార్



**దమ్మపేట, ఆగష్టు 24(మనం న్యూస్) :** ముసాయిదా ఓటర్ల జాబితా పోలింగ్ కేంద్రాలలో ప్రచురించామని, ఓటర్లందరూ ఓటరు జాబితాను పోలింగ్ కేంద్రాలలో లేదా బి ఎల్ ఓ వద్ద లేదా తహసీల్దార్ వారి కార్యాలయం నందు పరిశీలించుకోగలరని తహశీల్దార్ ముజాహిద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 1 వరకు 18 సంవత్సరములు నిండిన వారు ఫారం-6 ద్వారా కొత్త ఓటు నమోదుకు, మరణించిన వారి పేరును తొలగించుటకు వారి కుటుంబ సభ్యులు ఫారం 7 ద్వారా, జాబితా నందు తప్పుల సవరణ పిడబ్ల్యుడి మార్కింగ్ ఓటరు బదిలీ కోసం ఫారం 8 ద్వారా బూత్ లెవెల్ అధికారి వద్ద కానీ విహెచ్ఎ యాప్ ద్వారా కానీ ఎన్ వి ఎస్ పి పోర్టల్ ద్వారా కానీ మీసేవ ద్వారా కానీ లేదా దరఖాస్తును పూరించి తాసిల్దార్ వారి కార్యాలయం వద్ద ఇవ్వాలని తెలిపారు. ఈ నెల 26, 27 తేదీల్లో, సెప్టెబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు ఉందని, బూత్ స్థాయి అధికారులు వారి వారి పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

# శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేసిన వేద పండితులు విజయ మారుతీ శర్మ



**దమ్మపేట, ఆగష్టు 24(మనం న్యూస్):** ఇస్రో శాస్త్రవేత్తలకు దమ్మపేట మండలానికి చెందిన జ్యోతిష్య వాస్తు పండితులు విజయ్ మారుతీ శర్మ అభినందనలు తెలిపారు. ప్రపంచంలో ఎన్నో దేశాలు ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలమైన చంద్రుడి దక్షిణధృవ రోహణాన్ని విజయవంతంగా నిర్వహించి ప్రపంచంలోనే మొట్టమొదటి దేశంగా పేరొందిన భారతదేశానికి ఘన కీర్తి తెచ్చిన శాస్త్రవేత్తలు అందరికీ అభినందనలు తెలిపారు.

## ముంపు బాధితులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి

### సిపిఎం ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా

**భద్రాచలం, ఆగస్టు 24( మనం న్యూస్) :** అశోక్ నగర్ కొత్త కాలనీ కరకట్ట వద్ద ఉన్న గోదావరి ముంపు బాధితులకు వెంటనే డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని సిపిఎం ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసిల్దార్ శ్రీనివాస్ కు వినతిపత్రం అందించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకుంటానని తహశీల్దార్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గోదావరి వరదలు వచ్చిన ప్రతిసారి అశోక్ నగర్ కొత్త కాలనీలోని కరకట్ట వద్ద నివాసం ఉంటున్న పేదల గృహాలు వరద ముంపుకు గురవుతున్నాయని, తక్షణమే వాటిని ఖాళీ చేయించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు తరలిస్తామని అధికారులు అనేక మార్లు హామీ ఇచ్చి నేటి వరకు ఇండ్లు కేటాయించకపోవడం దారుణమని అన్నారు. వరదలు వచ్చినప్పుడు మాత్రమే అధికారులు మాటలు చెప్పి తప్పించుకోవడం సరైనది కాదని అన్నారు. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో వ్యవహరించాలని, వెంటనే అశోక్



నగర్ కొత్త కాలనీలో ఎంపిక చేయబడిన కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని, లేకుంటే రానున్న కాలంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు పి. సంతోష్ కుమార్, వరద ముంపు బాధితులు బొడ్డు లక్ష్మి, షబానా, కోయిల రత్నకుమారి, బొడ్డు రాధా, చింతల నరసింహారావు, పూజారి ఆదెమ్మ, బత్తిన సత్యవతి, ఎమ్మడి ప్రసాద్, విష్ణు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు..

## రెండో ఏఎన్ఎంల క్రమబద్దీకరణ అంశాన్ని ప్రస్తావించండి

### – సేవలకు గుర్తింపుగా క్రమబద్దీకరించాలి
### – ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్
### – ఏఎన్ఎంల ఉద్యోగ ప్రకటన ప్రతులను దహనం చేసి నిరసన

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 24 (మనం ప్రతినిధి) :** రెండో ఏఎన్ఎంల క్రమబద్ధీకరణ అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెల్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ను ఏఐటియుసి నేతలు కోరారు. మంత్రి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో మంత్రిని కలిసిన నేతల బృందం వినతిపత్రాన్ని అందించి తమ డిమాండు, సమస్యలను వివరించారు. అనంతరం 16 సంవత్సరాలుగా సేవలందిస్తున్న రెండో ఏఎన్ఎంలకు అన్యాయం చేస్తూ ఏఎన్ఎం ఉద్యోగ ప్రకటన ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా నరాటి ప్రసాద్ మాట్లాడుతూ క్రమబద్ధీకరణ డిమాండ్‌పై రెండో ఏఎన్ఎంలు రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం సమ్మె నివారణ చర్యలు చేపట్టకుండా మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రెండు దఫాలుగా జరిగిన చర్చల్లో కొన్ని డిమాండ్లు పరిష్కరించేందుకు సానుకూలత తెలిపినప్పటికి ప్రధానమైన రెగ్యులరైజ్ అంశాన్ని పరిగణలోకి తీసుకోకపోవడం దారుణమన్నారు. క్రమబద్ధీకరణ అంశాన్ని పక్కనపెట్టి ఏఎన్ఎంల ఉద్యోగ ప్రకటన విడుదల



చేయడం ప్రజల మెప్పుకోసమా అని ప్రశ్నించారు. 16 సంవత్సరాల అనుభవం ఉన్న వారికి అన్యాయం చేస్తూ ప్రభుత్వం ఏకపక్షంగా ఉద్యోగ ప్రకటన విడుదల చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. రెండో ఏఎన్ఎంలకు అన్యాయం చేస్తూ బయటి వారిని ఉద్యోగాల్లో చేర్చుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి వి. మల్లికార్జున్, ఏఐటియుసి అనుబంధ రెండో ఏఎన్ఎం యూనియన్ జిల్లా నాయకులు ఎండి.సజ్జుబేగం, బానోతు ప్రియాంక, కౌసల్య, అరుణ, రాములమ్మ, పార్వతి, పుష్ప, బాల నాగమ్మ, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



## ఆటో,మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

**ఇల్లందు, ఆగస్టు 24 (మనం న్యూస్):** ఇల్లందు ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు తోడేటి నాగేశ్వరరావు ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కు సారంగపాణిలు ఇల్లందు సిఎస్పి రైల్వే గేట్ ప్రాంగణంలో గురువారం ఎస్ ఆర్ఎల్టి కోల్ ట్రాన్స్పోర్ట్ కార్మికులతో కొత్త బస్టాండ్ సెంటర్లో ఆటో కార్మికులతో పోస్టర్ల ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇఫ్టూ ఆధ్వర్యంలో ఆగస్టు 29న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ ఆటో అండ్ మోటర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు తోడేటి నాగేశ్వరరావు ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నరాటి వెంకటేశ్వర్లు, బ్రాంచ్ అధ్యక్షులు పల్లి సుధాకర్ నాయకులు గంగారపు కోటయ్య, రమేష్,మోరే వెంకటేశ్వర్లు,రాజు వెంకటనారాయణ, బాలు, కార్మికులు పాల్గొన్నారు.



## జీవన్ జ్యోతి స్కూల్ లో సంబరాలు

**ములకలపల్లి, ఆగస్టు 24(మనం న్యూస్) :** ములకలపల్లి మండలంలోని జీవన్ జ్యోతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ వారు గురువారం త్రివర్ణ పతాకం జెండాలతో, చిన్నారి చిట్టి చేతులతో విజయ నినాదాలతో జయహో ధ్వనులతో విజయోత్సవ ర్యాలీని మన ములకలపల్లి మండల రహదారిపై నిర్వహించారు. చిన్నారులందరు పాల్గొని దేశభక్తి ,దేశ ఐకమత్యాన్ని, గొప్పతనాన్ని ,తమ తోటి వారికి తెలియజేసేలా ప్రజల ముందుకు వెళ్లారు.పాఠశాలలో చదువులతోపాటు, విలువలతో కూడిన విద్యా సాంస్కృతిక కార్యక్రమాలలో జీవన్ జ్యోతి స్కూల్ ఎప్పుడు ముందుంటుంది అని తెలియజేస్తూ యాజమాన్యం సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ జయంత్, సిస్టర్ సుగంధి, టీచర్స్ మరియు విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రావణమాస ముడుపులు చెల్లించుకున్న బిఆర్ఎస్ ఓబీ వర్కర్స్ యూనియన్

### ముఖ్యఅతిథిగా జెడ్పీటీసీ పోశం నరసింహారావు

**మణుగూరు, ఆగస్టు 24 (మనం న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు లోని మల్లెపల్లి ఉపరితల గనిలో పనిచేస్తున్న బిఆర్ఎస్ పార్టీ అనుబంధమైన ఓబీ వర్కర్స్ యూనియన్



కార్మికులు అందరూ శ్రావణమాసం అమ్మవారిలకు తమ ముడుపులు చెల్లించుకున్నారు. మణుగూరు లోని మల్లెపల్లి ఉపరితల గని లో బిఆర్ఎస్ పార్టీ అనుబంధమైన ఓబి వర్కర్స్ యూనియన్ ఏర్పడి కార్మికుల పక్షాన ఉండి కార్మికుల బాగోగులను చూడటంలో మంచి పేరు పొందింది. యూనియన్ నాయకులందరూ కూడా కాంట్రాక్టు కార్మికుల పక్షాన ఉండి ఈ యాజమాన్యం నుండి కార్మికుల అవసరాలను తీర్చడంలో మంచి పేరుగాంచింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఓబీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తురక రామకోటి, జాల నాగరాజు, తమ్మిశెట్టి లక్ష్మణ్, కనతాల మహేష్, మల్లేష్, బాలు,షబ్బీర్,నర్సింహరావు,ఇళయ కుమార్, ఇంకా వోల్వో సెక్షన్ సంబంధించిన కార్మికులు, టైర్ సెక్షన్ కార్మికులు ఇంకా పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డెంగ్యూ పాజిటివ్ గ్రామాలలో పైరెత్రమ్ స్ప్రే

**కరకగూడెం, ఆగస్టు 24 (మనం న్యూస్):** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కరకగూడెం సీతారాంపురం గ్రామాలలో గ్రామపంచాయతీ సర్పంచ్ ఊకే రామనాథం ఆ ,ధ్ ్వ ం ్ య ం లో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి,



వైద్యాధికారి కారం మధు సమక్షంలో డెంగ్యూ పాజిటివ్ వచ్చిన వారి ఇండ్లలో పైరెత్రమ్ పిచికారి చేయించటం జరిగింది. అలాగే గ్రామములోని అన్ని ఇండ్లలో తిరుగుతూ గ్రామస్తులకు దోమలు కుట్టకుండా గ్రామస్తులకు తగు సూచనలు సలహాలు ఇస్తూ అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని దోమల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. దోమల లార్వా ఉన్న పాత్రలను గుర్తించి తొలగించడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ వూకె రామనాథం, ఉప సర్పంచ్ రావుల రవి, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్యామసుందర్ రెడ్డి, వైద్యాధికారి మధు, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ అరుణ్ బాబు, గ్రామ పెద్దలు బైరిశెట్టి చిరంజీవి , బుడగం రాము, ఏఎన్ఎం పద్మ , హెల్త్ అసిస్టెంట్స్, ఆశాలు పాల్గొన్నారు.

## కులవృత్తులకు ప్రభుత్వం పెద్దపీట

### సీఎం కేసీఆర్ పాలన స్వర్ణ యుగం : రేగా కాంతారావు

### 170 మంది బీసీ కుల వృత్తుల దారులకు చెక్కులు పంపిణీ

**భద్రాచలం, ఆగస్టు 24( మనం న్యూస్) :** భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం నందు భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల చెందిన170 మంది బీసీ కుల వృత్తుల వారికి లక్ష రూపాయల చెక్కులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాత మధు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా



రేగా కాంతారావు మాట్లాడుతూ కులవృత్తిదారులకు చేయూతను అందించాలనే, ఆలోచనతోనే తెలంగాణ ప్రభుత్వం బీసీ కులవృత్తిదారులకు ఒక్కొక్క కుటుంబానికి లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరు ఏదో రకంగా ప్రభుత్వం నుంచి సహాయం పొందుతున్నామన్నారు. మనమంతా బిఆర్ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ గుర్తు పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు పోడెం వీరయ్య, జిల్లా ఉన్నతాధికారులు, పాల్గొన్నారు...

## చంద్ర యాన్ సక్సెస్ సంబరాలు

**బూర్గంపహాడ్, ఆగస్టు 24 (మనం న్యూస్):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక గ్రామం లో నాలుగు రోడ్ల కూడలిలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో చంద్ర యాన్ సక్సెస్ అయినందుకు సంబరాలు చేశారు. ఒరిస్సా రాష్ట్ర ఎమ్మెల్యేలు లోహిసింగ ఎమ్మెల్యే డాక్టర్ ముఖేష్ మహాలింగ పార్లమండి ఎమ్మెల్యే కే నారాయణ రావు ఆధ్వర్యంలో సారపాక సెంటర్లో టపాసులు కాల్చి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గం కన్వీనర్ బిక్షపతి జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య సీతారాం నాయక్ జిల్లా ఉపాధ్యక్షులు జాడి దేవేంద్ర ప్రసాద్ గూగుల్ లోతు బాలు నాయక్ భూక్య వెంకట్ నాయక్ వెలిశెట్టి రామారావు పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టులు మెళుకువలు నేర్చుకోవాలి

**ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) డిప్యూటీ డైరెక్టర్ మానస కృష్ణ కాంత్**
**– పిఐబి ఆధ్వర్యంలో జర్నలిస్టులకు 'వార్తలాప్' వర్క్ షాప్**
**– జర్నలిస్ట్ ప్రతినిత్యం విద్యార్థిగా ఉంటే వృత్తి నైపుణ్యం పెరుగుతుంది**
**– డిజిటల్ యుగంలో జాగ్రత్తలు తప్పనిసరి**
**– ఆధారాలతోనే వార్తలకు మనుగడ**






**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 24 (మనం ప్రతినిధి):** మారుతున్న కాల గమనంలో డిజిటల్ కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు మెలకువలు నేర్చుకోవాలని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పి ఐ బి) డిప్యూటీ డైరెక్టర్ మానస కృష్ణ కాంత్ జర్నలిస్టులకు సూచన చేశారు. గురువారం కొత్తగూడెంలోని సింగరేణి గెస్ట్ హౌస్ లో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) ఆధ్వర్యంలో జర్నలిస్టులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మానస కృష్ణ కాంత్ మాట్లాడుతూ, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను,దేశ ప్రజా ప్రతినిధుల, ప్రజోపయోగ కార్యక్రమాలతోపాటు, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల ఉపయోగాలు, అమలు తీరు పెన్నుల పైన నిష్పక్షపాతంగా సమాచారాన్ని పబ్లిక్ డొమైన్ లో ఉంచుతుందని, జర్నలిస్టులు తమ కథనాలకు తోడుగా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో సైట్ నుండి తమ డేటాను కూడా నిస్సంకోచంగా వాడుకోవచ్చని మానస కృష్ణ కాంత్ తెలిపారు. జర్నలిస్టులు పూర్తి ఆధారాలతో కథనాలను వార్తలను ఇస్తేనే ప్రజలకు నిజమైన, వాస్తవమైన సమాచారాన్ని అందించినట్లు అవుతుందని కృష్ణకాంత్ తెలిపారు. –సింగరేణి పురోగతిలో జర్నలిస్టుల పాత్ర మరవలేం..– డైరెక్టర్ ఫైనాన్స్ ఎన్ బలరాం ముఖ్య అతిథిగా హాజరైన సింగరేణి డైరెక్టర్ ఫైనాన్స్ ఎన్ బలరాం మాట్లాడుతూ, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో వారు సింగరేణి ప్రాంత విలేకరుల కోసం ప్రత్యేక ఆసక్తితో ఈ సమావేశాన్ని నిర్వహిస్తామని తెలపగానే తమ వంతుగా తాము సహకారాన్ని అందించామని, అలాగే తాము ఎంతో పని ఒత్తిడితో బిజీగా ఉన్నప్పటికీ ఇటువంటి సమావేశాల్లో పాల్గొంటున్న సోదర పాత్రికేయులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సింగరేణి అభివృద్ధి లో పాత్రికేయ మిత్రుల పాత్ర ఎంతో ఉందన్నారు. సింగరేణి సంస్థ ఆపద కాల పరిస్థితుల్లో ఉన్నప్పుడు జర్నలిస్టులు సింగరేణి పట్ల పాజిటివ్ వార్తలు రాసి సింగరేణి సంస్థ నిలబడేందుకు కృషి చేశారని డైరెక్టర్ ఫైనాన్స్ బలరాం గుర్తు చేశారు.ప్రభుత్వానికి ప్రజలకు వారధి... – పి ఐ బి జాయింట్ డైరెక్టర్ పి బాలకృష్ణకేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధీనంలోని పత్రికా సమాచార కార్యాలయం ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తోందని, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఖచ్చితమైన సమాచారాన్ని ప్రజలకు, మీడియా కు చేరవేయడంలో పత్రికా సమాచార కార్యాలయం ముఖ్య పాత్ర పోషిస్తోందని జాయింట్ డైరెక్టర్, పి ఐ బి వి బాల కృష్ణ తెలిపారు.విషయ పరిజ్ఞానంతోపాటు అప్ డేట్ గా ఉండాలి..– రచన జర్నలిజం కళాశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వరరావు జర్నలిస్టులు నైతిక విలువలు పాటిస్తూ, ఖచ్చితమైన వార్తలను సేకరించి ప్రజలకు మరిన్ని మంచి వార్తలు అందేలా చూడాలని, మనం వార్తలు రాసే ముందు నిర్ధారణ చేసుకోవడం చాలా ముఖ్యమని ఉమా మహేశ్వర రావు అన్నారు. మీడియా లో విలువలు, అభివృద్ధి జర్నలిజం అంశాలపై ఆయన మాట్లాడారు.డేటా సురక్షితంగా ఉంచుకోవాలి....సి డాక్ సైంటిస్ట్ జగదీప్ బాబుడిజిటల్ యుగంలో మనం కేవలం వార్తలే కాకుండా మనం వాడే మొబైల్ ఫోన్లు తరచూ అప్డేట్ చేస్తూ ఉండాలని, ఈ సైబర్ యుగంలో మనం డేటా ను సురక్షితంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని గురించి మరో వక్త సి డాక్ సైంటిస్ట్ జగదీప్ బాబు అన్నారు. – జర్నలిస్టు సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి..కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ సిబిసి అధికారి కోటేశ్వర రావు ... పిఐబి కార్యకలాపాల తీరును జర్నలిస్టులకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న పీఐబీలో మృతి చెందిన జర్నలిస్టులకు, ఆపద కాలంలో ఉన్న జర్నలిస్టులకు కొన్ని సంక్షేమ పథకాలు ఉన్నాయని, వాటిని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.– లోటుపాట్లను ఎత్తిచూపేది జర్నలిజం భద్రాద్రి కొత్తగూడెం డీఆర్ఓ రవీంద్రనాథ్ ... ప్రభుత్వాలకు, అధికారులకు, మీడియా కు మధ్య వారధిలా పని చేస్తున్న మీడియా గురించి ఎంత చెప్పినా తక్కువేనని, సంక్షేమ పథకాలు ఏ విధంగా ప్రజల్లోకి వెలుతున్నాయో.. అధికార యంత్రాంగం అప్రమత్తమై పథకాల లోటు పాట్లు ప్రభుత్వాలకు తెలియజేసేది మీడియానే నని. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో అధికార యంత్రాంగానికి తెలియజేసి పథకాలు అమలు తీరు ఖచ్చితంగా ఉండేలా మీడియా చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం డి పి ఆర్ ఓ శీలం శ్రీనివాసరావు జర్నలిస్టులు సబ్బతి శివమూర్తి, కల్లోజి శ్రీనివాస్, ఇమంది ఉదయ్ కుమార్, ఎర్రా ఈశ్వర్, సుధాకర్, డివి, చిరంజీవితో పాటు పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## భద్రాచలం అభివృద్ధి గురించి సీఎం వద్ద మాట్లాడలేరు...

**సంక్రాంతి గంగిరెద్దుల్లా భద్రాచలంలో తిరుగుతున్నారు : ఎమ్మెల్యే పొదెం వీరయ్య**




**భద్రాచలం, ఆగస్టు 24 (మనం న్యూస్) :** బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే భద్రాచల ప్రాంతం చుట్టూ తిరుగుతూ, మొసలి కన్నీళ్లు కారుస్తూ ప్రజల దగ్గర నటిస్తున్నారని ఎంఎల్ఏ పొదెం వీరయ్య విమర్శించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఎంఎల్ఏ మాట్లాడుతూ 9 ఏండ్ల పాటు భద్రాచలాన్ని అభివృద్ధికి నోచుకోకుండా, జీవత్సవంలాగా తయారవ్వటానికి కారణం ఏ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. భద్రాచల ప్రాంతానికి చెత్త పోసుకోవడానికి స్థలం లేదని, ఐదు పంచాయతీలు తిరిగి భద్రాచలంలో కలిపే విధంగా ప్రయత్నం చేయాలని ఎన్నో మార్లు కేసీఆర్ చెప్పినా చెవిటోడు చెవులు శంఖం ఊగినట్టుగానే పరిస్థితి తయారైందన్నారు. భద్రాచలం ప్రాంతం, ప్రజానికం మీద చిత్తశుద్ధిలేని కొంతమంది ప్రజాప్రతినిధులు, భద్రాచలానికి ఏదో చేసేసినట్టుగా గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. బిఆర్ఎస్ మంత్రులను, ప్రజా ప్రతినిధులను నేను ఒక్కటే అడగదలచుకున్నానని, తెలంగాణ రాష్ట్రంలో గడిచిన తొమ్మిదేళ్లలో పూర్తిగా అభివృద్ధికి పూర్తిగా దూరంగా ఉన్న ప్రాంతం ఒక్క భద్రాచలం అని అన్నారు. భద్రాద్రి రాముడు తెలంగాణ దేవుడు అంటూ తెలంగాణ ఉద్యమంలో మార్మోగిన భద్రాచలాన్ని ఇలా విస్మరించిన కేసీఆర్ని నిలదీసే ధైర్యం మీకుందా అన్నారు. ఇంకా ఎన్నికలకు నాలుగు నెలల కాలం ఉందని, బిఆర్ఎస్ పార్టీ మంత్రులకు, ప్రజాప్రతినిధులకు నిజంగా దమ్ముంటే ఈ నాలుగు నెలల్లో భద్రాచలం ప్రాంతానికి ఇచ్చిన 100 కోట్లు, 1000 కోట్ల హామీలు పనులు పూర్తిచేసి మీరు ప్రజలను ఓటు అడగాలని సూచించారు. అప్పుడే ఈ ప్రాంత ప్రజలకు మీ మీద నమ్మకం కలుగుతుందని, లేదంటే మీ నాయకుడు ఎప్పుడు చెప్పే మాట ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విజ్ఞత లేని వ్యక్తి రేగా కాంతారావు అని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఓట్లతో గెలిచి, వారి నమ్మకాన్ని వమ్ము చేసి, కాంగ్రెస్ కార్యకర్తలు ఇచ్చిన ఎమ్మెల్యే పదవితోనే ఈరోజు తెలంగాణ ప్రభుత్వంలో విప్పుగా కొనసాగుతున్న మోసగాడని తెలిపారు. పినపాక ప్రజలను నమ్మించి నట్టేట ముంచిన రేగా కాంతారావు ఈరోజు బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా భద్రాచలం కొచ్చి ఈ ప్రాంతాన్ని అలా చేస్తాం ఇలా చేస్తామని మాయమాటలు చెబుతూ గంగిరెద్దులా ఈ ప్రాంతంలో తిరుగుతున్నాడని విమర్శించారు. ఈ గంగిరెద్దులను భద్రాచలం ప్రాంతం నుంచే కాదు యావత్ తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రజలు ఊరికిచ్చి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరెళ్ళ నరేష్, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోగల శ్రీనివాసరెడ్డి,బలుసు నాగ సతీష్,యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు చింతరేల సుధీర్,సరెళ్ళ వెంకటేష్,ఎడారి ప్రదీప్,రాసామాల రాము,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంతల రాజేశ్వరి,పందాల సరిత,మద్దేటి జయ, పుట్ట జానకీరాణి, రూప,నాగమణి తదితరులు పాల్గొన్నారు.



## జనసేన పార్టీ మండల స్థాయి నాయకుల సమావేశం

**అశ్వారావుపేట టౌన్ , ఆగష్టు 24(మనం న్యూస్ ):** దమ్మపేట మండల కేంద్రంలో జనాసేన పార్టీ నియోజికవర్గ ఇంచార్జి డేగల రామచంద్రరావు అధ్యక్షతన జనసేన పార్టీ దమ్మపేట మండల కమిటీ సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో రానున్న అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ఎన్నికలకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్దం కావాలి అని పిలుపునిచ్చారు. అలానే రానున్న రోజుల్లో పార్టీ బలోపేతం కోసం చేపట్టనున్న కార్యక్రమాల వివరాలను ఇంచార్జి డేగల రామచంద్రరావు వివరించారు. త్వరలోనే అశ్వారావుపేట నియోజకవర్గంలో పెను మార్పులు చోటు చేసుకోబోతున్నాయని దానికి కేంద్రంగా అశ్వారావుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఉండబోతుంది అని నాయకుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రెహమాన్ ఉపాధ్యక్షుడు జంగా చంద్రశేఖర్,యార్లగడ్డ శ్రీనివాసరావు అశ్వారావుపేట మండల అధ్యక్షుడు ఇస్లావత్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి



**ఖమ్మం, ఆగష్టు 24(మనం న్యూస్) :** గుర్తు తెలియని వ్యక్తి రైల్వే స్టేషన్ వద్ద ట్రాక్ దాటుతున్న సమయంలో ప్రమాదవుశాతు రైలు ఢీకొని గాయ పడిన వ్యక్తి గురువారం ఉదయం చనిపోయాడు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ రూమ్ తరలించారు. రైల్వే ఎస్ఐ భాస్కర్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# జయ హో భారత్.. జయ హో ఇస్రో...

## చంద్రయాన్ 3 ప్రయోగాన్ని వీక్షించిన ప్రియదర్శిని విద్యార్థినులు

**ఖమ్మం, ఆగష్టు 24(మనం న్యూస్) :** ఖమ్మం రూరల్ మండలంలోని ప్రియదర్శిని మహిళల కళాశాల లో బుధవారం జరిగిన చంద్రయాన్ 3 లోని ల్యాండర్ విక్రమ్ చంద్రునిపై కాలు మోపిన అపురూప ఘట్టాన్ని కళాశాల విద్యార్థినులు డిజిటల్ స్క్రీన్ పై తిలకించారు. చంద్రయాన్ –3 విజయవంతం కావడం పట్ల విద్యార్థినులు, అధ్యాపకులు జాతీయ జెండా తో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తల పరిశోధనను అభినందించారు. ఈ పరిశోధన ద్వారా భారతదేశం ఉన్నత శిఖరాలను చేరుకుందని తెలిపారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ మువ్వన్నెల జెండా చంద్రుని ముద్దాడటం,ప్రజ్ఞాన్ రోవర్ జాతీయ చిహ్నాన్ని చంద్రునిపై ముద్రించటం వంటి దృశ్యాలను ప్రత్యక్షంగా చూడడం చాలా ఆనందం కలిగించిందని, భారత దేశ ఖ్యాతి ప్రపంచ నలుమూలలకు విస్తరించిందని, ఈ ప్రయోగం విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు.



కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి గోపాల్ మాట్లాడుతూ ఇటువంటి ప్రయోగాలు విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలకు ప్రేరణ కలిగిస్తుందని అభిప్రాయ పడ్డారు. విద్యార్థుల్లో పరిశోధన అంశాలలో కళాశాల అధ్యాపకులు మరియు యాజమాన్యం ఎప్పుడు తోడ్పాటు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు విద్యార్థినులు ప్రత్యక్ష ప్రసారంలో పాల్గొన్నారు.

# శ్రీసంధ్య షోరూం నందు హీరో గ్లామర్ వెహికల్ రీ లాంచింగ్

**మధిర, ఆగస్ట్24(మనం న్యూస్):** శ్రీ సంధ్య మోటార్స్ హీరో షోరూం మధిర లో కస్టమర్లు ఎంతగానో మెచ్చిన హీరో గ్లామర్ వెహికల్ ను గురువారం లాంచ్ చేశారు. ఎంతగానో ప్రజాధరణ పొందిన హీరో గ్లామర్ వెహికల్ ను హీరో మోటర్ కార్ప్ జోనల్ హెడ్ సంజీవ్ కుమార్ యాదవ్ , ఏరియా సర్వీస్ హెడ్ బెడ్ ప్రకాష్ , టెరిటరీ సర్వీస్ మేనేజర్ నవీన్ చే హీరో గ్లామర్ వెహికల్ ను రీలాంచ్ చేయడం ఎంతో ఆనంద దాయకమని శ్రీ సంధ్య మోటార్స్ షోరూం అధినేత లక్కిరెడ్డి సుధాకర్ రెడ్డి తెలియజేశారు.ఈ గ్లామర్ వెహికల్ గురువారం నుండి స్థానిక హీరో షోరూం శ్రీ సంధ్య మోటార్స్ లో అందుబాటులో ఉంటాయని సంస్థ అధినేత లక్కిరెడ్డి సుధాకర్ రెడ్డి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హీరో మోటోకాప్ హెడ్స్ , కస్టమర్ లు మరియు శ్రీ సంధ్యా మోటార్స్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బుకింగ్స్ కొరకు 9440336631 ఫోన్ నంబర్లను సంప్రదించవలసినదిగా లక్కిరెడ్డి సుధాకర్ రెడ్డి తెలియజేశారు.



# అంగవైకల్యాలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం

## నియోజకవర్గ వ్యాప్తంగా 5062 లబ్ధిదారులు

**సత్తుపల్లి టౌన్, ఆగష్టు 24(మనం న్యూస్) :** దివ్యాంగుల పెన్షన్లు రూ.3016/– నుండి రూపాయలు నుండి 4016/– పెంచిన సందర్భంగా సత్తుపల్లి పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ యందు జరిగిన కార్యక్రమంలో భాగాంగ సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య అధికారులతో కలిసి లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీలను అందజేయడం జరిగింది..అభివృద్ధి, సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పేదరికమే గీటురాయిగా సాగిపోతున్న కేసీఆర్ పాలనలో భాగంగా గురువారం సత్తుపల్లి పట్టణంలో 402 లబ్ధిదారులకు, రూరల్ మండలంలో 614 లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీలను ఇవ్వడం జరిగింది....కల్లూరు మండలంలో 1146,పెనుబల్లి మండలంలో 1002,వేంసూర్ మండలంలో727 లబ్ధిదారులకు నియోజకవర్గ వ్యాప్తంగా 5062 మంది లబ్ధిదారులు ఉన్నట్లు ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తెలియజేశారు. అన్ని రంగాలలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నది తెలియజేశారు..ఇంతటి అద్భుతమైన పరిపాలన అందిస్తున్న కేసిఆర్ కి, మాకు మీ నిండు దీవెనలు ఉండాలని



తెలియజేశారు...ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ కూసంపూడి మహేష్ , జిల్లా గ్రంధాలయ చైర్మన్ కొత్తూరు ఉమ , ఎంపీపీ దొడ్డ హైమావతి – శంకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శీలపురెడ్డి హరికృష్ణ రెడ్డి ,జడ్పీటిసి సభ్యులు కూసంపూడి రామారావు ,ఆత్మ చైర్మన్ వాసుదేవరావు , టౌన్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ రఫీ ,అంకం రాజు , బీఆర్ఎస్ పార్టీలో వివిధ హోదాలలో వున్న ముఖ్య నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

## సమావేశంలో డిసిసి అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

**ఖమ్మం, ఆగష్టు 24(మనం బ్యూరో) :** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనం లో జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన బూత్ లెవెల్ ఏజెంట్ల కోసం నియమించబడిన నియోజకవర్గ ఇంఛార్జి లు , మండల ఇంఛార్జి లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల పై చార్జ్ షీట్ కరపత్రం విడుదల చేశారు. తిరగబడదాం తరిమి కొడదాం నినాదంతో పోస్ట్ కార్డ్ సంతకాల సేకరణకు జిల్లా లోని ప్రతి గడపకు కరపత్రం, పోస్ట్ కార్డ్ సంతకం ద్వారా ప్రతి ఒక్కరినీ కలిసి గత పదేండ్లు గా బిఆర్ఎస్, బిజెపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఖమ్మం నియోజకవర్గ పి సి సి సభ్యులు, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మహ్మద్ జావేద్, ఖమ్మం నియోజకవర్గ పి సి సి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, వైరా నియోజకవర్గ ఇంఛార్జి యర్రం బాలగంగాధరతిలక్, పాలేరు నియోజకవర్గ ఇంఛార్జి మదుపల్లి భాస్కర్ గౌడ్, జిల్లా నాయకులు తుల్లూరి బ్రహ్మయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్,ఖమ్మం లోని టౌన్ లో ఇంఛార్జి లు దొబ్బల సౌజన్య, నల్లమల సత్యంబాబు,ఆ ఏ రబ్బానీ, ఏన్కూరు మండల ఇంఛార్జి కిలారి అనిల్ కుమార్ వివిధ మండలాల ఇంఛార్జి లు అంబటి వెంకటేశ్వరరావు, కందుల వీరబాబు, మట్టూరి కృష్ణారావు,శ్రీ అజగర్, రామూర్తి నాయక్, పారుపల్లి విజయ్,వడ్లముడి కృష్ణయ్య, హలావత్ వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, భూక్యా బాలాజీ నాయక్, శివ వేణు, పెద్దబోయిన దుర్గాప్రసాద్, మధిర టౌన్ అధ్యక్షులు మిరియాల రమణ గుప్తా, స్వర్ణ నరేందర్, తలారి చంద్రప్రకాష్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# 27న నెల నెలా వెన్నెల 6వ వార్షికోత్సవం

**ఖమ్మం, ఆగష్టు 24(మనం న్యూస్):** ఈ నెల 27న నెల నెలా వెన్నెల 6వ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం 6గంటలకు భక్త రామదాసు కళాక్షేత్రం ఖమ్మంలో జరుగుతున్నదని దానిని జయప్రదం చేయాలని నెలనెలా వెన్నెల కార్యదర్శి ఏ. సుబ్రహ్మణ్య కుమార్ విజ్ఞప్తి చేశారు. భక్త రామదాసు కళాక్షేత్రంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2007 లో నెల నెలా వెన్నెల ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ప్రారంభం అయిందన్నారు. 2015నుండి అమరజీవి అన్నా బత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ ,ప్రజానాట్యమండలి, కళా పరిషత్ ఆధ్వర్యంలో 7వ సంవత్సరంలో అడుగు పెట్టబోతున్నామని కార్యక్రమ విజయానికి తోడ్పడిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రత్యేకంగా కళలను ప్రోత్సహిస్తున్న భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ పెద్దలకు కళాభివందనలు తెలిపారు. అనంతరం కళాపరిషత్ అధ్యక్షులు కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేముల సదానంద ,అధ్యక్షులు మోటమర్రి జగన్మోహన్ రావు, నామ లక్ష్మీనారాయణ



ప్రసంగించారు. ఈ నెల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పువ్వాడ అజయ్ కుమార్ ఆత్మీయ అతిథులుగా మొగిలి శ్రీనివాసరెడ్డి , సంక్రాంతి ప్రసాదరావు, డాక్టర్ పెంటేల అసాధారణ , డాక్టర్ కావ్య యాలముడి పాల్గొంటారని తెలిపారు. ఖమ్మం లెజెండ్ కళాబందు వి వి అప్పారావు, పౌరాణిక నాటక రంగస్థల ప్రముఖులు పుతుంబాక శ్రీ కృష్ణ ప్రసాద్, సామాజిక కార్యకర్త అన్నం ఫౌండేషన్ అన్నం శ్రీనివాసరావు లకూ అభినందన సత్కారం ఉంటుందని తెలిపారు. 'రైతే రాజు' నాటిక ప్రదర్శన ఉంటుందని, కళాకారులు, కళాభిమానులు , అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# నామ ముత్తయ్య ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

## డీ మార్ట్ అడ్డా ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు పంపిణీ

**ఖమ్మం, ఆగస్ట్ 24(మనం న్యూస్):** నామ ముత్తయ్య ట్రస్ట్ సేవలు వెలకట్టలేనవని పలువురు వక్తలు పేర్కొన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం డీమార్ట్ ఆటో అడ్డా లో ఆటో డ్రైవర్లకు పెద్ద ఎత్తున ఖాకీ చొక్కాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ అందజేసి, ఎంపీ నామ నాగేశ్వరరావు అందరివాడయ్యారని నామ ముత్తయ్య ట్రస్ట్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త, విశ్రాంత విద్యాధికారి అవినేని శేషయ్య, నామ సేవా సమితి నాయకులు చీకటి రాంబాబు, అడ్డా ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మిరియాల శేఖర్ గౌడ్, ఉపాధ్యక్షులు నారాయణ, కార్యదర్శి శ్రీనివాస్ తో పాటు జానీ, కృష్ణ, రత్నం, నాగేంద్ర, యాకయ్య, ఉప్పలయ్య, శంకర్, రాజు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్స్ వాల్ పోస్టర్‌ను విడుదల చేసిన రేణుక



**ఖమ్మం, ఆగష్టు 24(మనం న్యూస్) :** ఖమ్మం పట్టణంలోని, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మానుకొండ రాధా కిషోర్ నివాసము నందు, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ మద్ది శ్రీనివాస్ రెడ్డి అచ్చు వేయించిన కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్స్ వాల్ పోస్టర్ ను కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు, కేంద్ర మాజీ మంత్రివర్యులు రేణుకా చౌదరి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా, రేణుకా చౌదరి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్, భూమి డిక్లరేషన్, తదితర వివరాలతో కూడిన, వాల్ పోస్టర్ ను గ్రామాలలో వేయించటం వలన ప్రజలకు కాంగ్రెస్ పార్టీ విధి, విధానాలు తెలుస్తాయని అన్నారు. ఈ సారి రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమములో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యడవల్లి కృష్ణ, టీపీసీసీ సభ్యులు రామ్మూర్తి నాయక్, కట్ల రంగారావు, వెంపటి రంగారావు, ఐఎన్‌టియుసి కొత్తగూడెం జిల్లా ప్రెసిడెంట్ జలీల్, మండేపూడి అప్పారావు, పోటు లెనిన్, పోటు అభిలాష్ చౌదరి, ఉమా మహేశ్వర గుప్త, శ్రీను, మంగు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మెరుగైన విద్యను అభ్యసించాలి
## ప్రధానోపాధ్యాయులు ఇస్లావతి నరేష్



**ఆళ్లపల్లి, ఆగస్టు 24 (మనం న్యూస్):** ఏజెన్సీ ప్రాంతాల్లోని విద్యార్థులు మెరుగైన విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఐటీడీఏ తరఫున విద్యార్థులకు కాపీ రైటింగ్ బుక్స్, పెన్సిల్, ఎరేజర్, సర్పనార్, పౌచ్, లను అందజేయడం హర్షనీయమని గడిచిన సంవత్సరం పాఠశాల విద్యార్థులను పరీక్షించి అబాకాస్ పజిల్స్ ని అందించారని గిరిజన విద్యార్థుల పట్ల ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకొని వారి అభివృద్ధి కి తోడ్పడుతుందని జిపిఎస్ తునికిబండల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇస్లావత్ నరేష్ అన్నారు, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న విద్యా ప్రమాణాలతో ఉన్నతమైన విద్య అభ్యసించి విద్యార్థులు ఉనతసాయికి చేరాలని పాఠశాల వారన్నారు. నాణ్యత కలిగిన విద్యా సమగ్రిని విద్యార్థులకు అందించిన ఐటీడీఏ పీవో, డి డి, ఏ టి డబ్ల్యూ ఓ ఇల్లందు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు సమ్మక్క, ఎస్సీ ఆర్ పి ప్రసాద్, ఎడబ్ల్యూటి సుజాత, ఎండిఎం వర్కర్ నాగమణి, ప్రజలు పాల్గొన్నారు.

## చంద్రయాన్ -3 విజయవంతమైన సందర్భంగా
# విద్యార్థులతో విజయోత్సవ ర్యాలీ



**ఇల్లందు, ఆగస్టు 24 (మనం న్యూస్):** చంద్రుని దక్షిణ ధ్రువం పై చంద్రయాన్ 3 బుధవారం విజయవంతంగా ల్యాండ్ అయిన సందర్భంగా ఇల్లందు మార్గదర్శిని సాహితీ విద్యాసంస్థలు గురువారం పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ ఆద్యంతం పట్టణ ప్రజలను ఆకట్టుకుంది. 2 వేల మంది విద్యార్థులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు యాజమాన్యం మువ్వన్నెల జెండాలను చేబుని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి రాంబాబు, అర్వపల్లి రాధాకృష్ణ సాహితీ కళాశాల డైరెక్టర్ మాదినేని శ్రీనివాస్, ప్రిన్సిపాల్స్ రాంబాబు., దామోదర్ లు మాట్లాడుతూ చంద్రయాన్ 3 విజయవంతంలో అహర్నిశలు శ్రమించిన ఇస్రో శాస్త్రవేత్తల కృషిని కొనియాడారు. ప్రపంచమంతా భారతదేశం వైపు చూసే విధంగా వారు కృషి చేశారని వారి మాటల ద్వారా అభినందించారు., ర్యాలీ పొడుగునా విద్యార్థినీ విద్యార్థులు ప్రజలకు మిఠాయిలు పంచుతూ శుభాకాంక్షలు తెలిపారు.

# భారతావని గర్వించదగ్గ విజయం

**చర్ల, ఆగస్ట్ 24 (మనం న్యూస్) :** చంద్రయాన్ 3 విజయవంతం కావడం భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిందని ఇది భారతీయులందరూ గర్వించదగిన ఘట్టమని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. చంద్రయాన్ 3 అద్భుతమైన సక్సెస్ సాధించడం పై ఆయన స్పందిస్తూ దేశం కోసం శాస్త్రవేత్తలు స్ఫూర్తిదాయక కార్యం సాధించారని కొనియాడారు రాబోయే రోజుల్లో మరిన్ని శాస్త్రీయ మిషన్లకు ఇది మార్గం సుగమం చేస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రయోజనం విజయవంతం చేసేందుకు అహర్నిశలు శ్రమించిన ఇస్రో శాస్త్రవేత్తలకు అధికారులకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు.

# ఇల్లందు జె కె ఉపరితల గని ని సందర్శించిన జి.యం(సేఫ్టీ)

**ఇల్లందు, ఆగష్టు 24(మనం న్యూస్):** ఇల్లందు ఏరియా లోని జెకె ఉపరితల గనిని జి.ఎం (సేఫ్టీ కొత్తగూడెం రీజియన్) జి.కుమారస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఏరియా స్టోర్. ఏరియా వర్క్ షాప్ సంబంధించిన ఎస్.ఎం.పి పై సమీక్ష నిర్వహించారు. తదుపరి వారు పేలుడు రవాణా (ఎక్స్ ప్లోజివ్) వాహనాని తనికి చేయడం జరిగినది. వర్షాకాలంలో ఉపరితల గనులలో నిర్వహించే మన్ సూన్ ఆడిట్ కు సంబంధించిన రిపోర్ట్ ను అడిగి తెలుసుకుని, క్వారీలోనీ పని ప్రదేశాలను సందర్శించి బొగ్గు వెలికితీయుట, ఓబి పనులు మరియు బ్లాస్టింగ్ సంబంధించిన పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని, విధుల నందు నిర్లక్ష్యం వహించరాదని, నా భద్రత నా బాధ్యత అనే విషయాన్ని మరవకూడదని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ పంజాల శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, మేనేజర్ పూర్ణచందర్, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, వెంకటేశ్వర్లు, కిషన్, ఇంజనీర్స్ పవన్ కుమార్, నాగేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొనారు

### ఇల్లందు ఏరియాలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల మార్గదర్శకాల పోస్టర్ విడుదల

ఇల్లందు ఏరియాలోని జి.ఎం కార్యాలయం నందు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు-2023 సందర్భంగా అక్టోబర్ 20 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు నిర్వహించే విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు-2023 సందర్భంగా మూడు నెలలు ముందస్తు కార్యక్రమాలను తేదీ.16.08.2023 నుండి 15.11.2023 వరకు నిర్వహించాల్సిందిగా సెంట్రల్ విజిలెన్స్ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా సింగరేణి ఇల్లందు ఏరియా జిఎం కార్యాలయంలో ఇల్లందు ఏరియా



ఇన్చార్జ్ జనరల్ మేనేజర్ పంజాల శ్రీనివాస్ మార్గదర్శకల పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జి.యం(ఇయం) ప్రభాకర్ రావు, యస్ వోటు జి.యం. మల్లారపు మల్లయ్య, ఏ.జి.ఎం(ఐ.డి) యం.గిరిధరరావు, డిజియం (పర్సనల్) జీవి.మోహనరావు, ఇతర అధికారులు బాలాజీ నాయుడు, మహేష్, చిన్ని ప్రసాద్ ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఉద్యోగవిరమణ చేస్తున్న సి.యం.ఓ కు సన్మానం

సింగరేణి సంస్థ కొత్తగూడెం హాస్పిటల్ నందు చీఫ్ మెడికల్ ఆఫీసర్ గా పని చేసి ఈ నెలలో పదవి విరమణ చేయనున్న బి.వెంకటేశ్వరరావు చీఫ్ మెడికల్ ఆఫీసర్ ను గురువారం ఇల్లందు ఏరియా లోని జియం కార్యాలయం నందు జి.యం. జాన్ ఆనంద్ ఇతర ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జి.యం(ఇయం) ప్రభాకర్ రావు, యస్ వోటు జి.యం. మల్లారపు మల్లయ్య, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ పి.శ్రీనివాసు, ఏ.జి.ఎం(ఐ.డి) యం.గిరిధరరావు, డిజియం (పర్సనల్) జీవి.మోహనరావు, డా.మల్ల రెడ్డి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామవరంలో పొజిషన్ సర్టిఫికెట్లు ఇప్పించాలని మంత్రికి వినతి

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 24 (మనంప్రతినిధి) :** కొత్తగూడెం పురపాలక సంఘ పరిధిలోని రామవరం ఏరియా(1/70 యాక్ట్ ప్రాంతములో 4 వేల గృహలకు పొజిషన్ సర్టిఫికేట్ జారీ చేయవలసిందిగా కోరుతూ, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి .వినతిపత్రం అందచేసారు. గురువారం రామవరం ప్రాంతంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసే సందర్భంగా విచ్చేసిన మంత్రికి చైర్ పర్సన్ వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెం పురపాలక సంఘంలో కొంత భాగం అయిన రామవరం ఏరియాలో 7 వార్డులు సుమారుగా 4 వేల నివాస గృహాలున్నాయని, ఈ ప్రాంతం 1/70 యాక్ట్ సింగరేణి కాలరీస్ వారి ఆధీనములో ఉందని, ఈ ఏరియాలో సింగరేణి ఉద్యోగులు వారిపై ఆధారపడి కొన్ని సంవత్సరాల నుండి జీవనం సాగిస్తున్నారని, ఆ భూములలో సదరు ప్రాంత ప్రజలు స్థిరనివాసము ఏర్పరుచుకొని ఇంటి నిర్మాణం చేసుకొని జీవనము కొనసాగిస్తున్నారని, ఈ ప్రాంత ప్రజలకు అత్యవసర దృష్ట్యా వైద్యము కొరకు లేక పిల్లల



వివాహాల కొరకు ఇల్లు అమ్ముకొనుటకు గాని ఇంటి పై బ్యాంకు లోను తీసుకొనుటకు గాని వీలు లేకుండా ఉందని , రామవరం ప్రాంత ప్రజలు నిర్మించుకొన్నటువంటి ఇండ్లకు పొజిషన్ సర్టిఫికేట్ ను ఇప్పించి ఈ ప్రాంత ప్రజల అభివృద్ధికి తోడ్పాటుకు సహకారం అందిచాలని కోరుతూ కొత్తగూడెం మున్సిపల్చైర్పర్సన్ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు ఎమ్మెల్యే. వెంకటేశ్వరరావుకు కు వినతి పత్రం అందజేశారు.

# ఖాతాదారుని ఎకౌంట్లో డబ్బులు మాయం






**చర, ఆగస్ట్ 24 (మనం న్యూస్) :** చర్ల మండలం ఎస్బిఐ బ్యాంకు నందు టెంపరెవరిగా పనిచేస్తున్న సత్ప్రరాయ్ అనే వ్యక్తి విధులు నిర్వహిస్తున్నాడు. ఎస్బిఐ బ్యాంక్ స్టాఫ్ సత్పురాయి అనే వ్యక్తికి దేవరపల్లి గ్రామానికి చెందిన తెల్లం శంకర్రావు అనే వ్యక్తి కొత్త ఎటిఎం ను ఇచ్చి ఈనెల 21 న పిన్ జనరేషన్ చేయమని అడగడంతో ఎస్బిఐ బ్యాంక్ పక్కనే ఉన్న ఏటీఎం సెంటర్లోకి వెళ్లి ఖాతాదారుడు ఏటీఎం పిన్ నెంబర్ను జనరేజ్ చేసి ఖాతాదారుడు ఎకౌంట్లో నుండి 2000 రూపాయలను తీసి ఇవ్వడం జరిగింది. అనంతరం సత్పురాయ అనే వ్యక్తి ఏటీఎం ను తీసుకొని బ్యాంక్ లోకి వెళ్తుండగా ఖాతాదారుడు అడగడంతో కొత్త ఏటీఎం కదా అన్న పిన్ నెంబర్ ను బుక్ లో రాయాలని బ్యాంకులో ఉన్న స్వైప్ మిషన్ ద్వారా పదివేల రూపాయలను వేరే అకౌంట్ కు ట్రాన్స్ఫర్ చేశాడు. ఖాతాదారుడు మరల బుధవారం నాడు డబ్బుల కోసం ఎస్బిఐ బ్యాంకు కు ఆశ్రయించగా బ్యాంక్ యాజమాన్యం ఎకౌంట్లో డబ్బులు లేవని చెప్పడం తో బ్యాంకులో పని చేస్తున్న సత్ప్రరాయి పై ఖాతాదారుడు కి అనుమానం రావడం జరిగింది. వెంటనే బ్యాంకు మేనేజర్ కు తమ సిబ్బంది పై ఫిర్యాదు చేశాడు. ఖాతాను పూర్తిగా సెర్చ్ చేయగా పదివేల రూపాయల నగదును ఒక ఎకౌంటు కి ట్రాన్స్ఫర్ చేశారని బ్యాంకు మేనేజర్ తెలిపారు. తప్పు తన యాజమాన్య సిబ్బంది దే అని తెలుసుకున్న బ్యాంకు మేనేజర్ ఖాతాదారుడు కి పది వేల రూపాయలు తిరిగి ఇవ్వడం జరిగింది. తమ బ్యాంకులో పనిచేస్తున్న సత్ప్రరాయి అనే వ్యక్తిపై తగు చర్యలు తీసుకుంటామని బ్యాంకు మేనేజర్ తెలియజేశారు.

# పెన్షన్లు, సంక్షేమ పథకాలే పేదలకు శ్రీరామరక్ష

## జడ్పీ చైర్మన్ లింగాల కమలరాజు



**మధిర, ఆగస్ట్ 24(మనం న్యూస్):** దివ్యాంగులకు మరింత చేయూతను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పెన్షన్ ను రూ. 3016 ల నుండి రూ. 4016 లకు పెంచిందని జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పేర్కొన్నారు. గురువారం మధిర రైతు వేదిక నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దివ్యాంగులకు పెంచిన పెన్షన్‌ను ప్రొసీడింగ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మానవీయ కోణంలో ఆలోచించి, దివ్యాంగుల పెన్షన్ వారి ఖర్చులకు సరిపడా ఉండాలని పెంచినట్లు తెలిపారు. 4016 రూపాయల పెన్షన్ తో సామాజిక భద్రత కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కొత్త రాష్ట్రమైనా సంక్షేమం కోసం ఏ రాష్ట్రం లో పెట్టనంత ఖర్చు తెలంగాణలో పెడుతున్నట్లు వివరించారు. దంపతులతో పెన్షన్ పొందుతున్నవారు మరణిస్తే, ఆటోమేటిక్ గా వారి జీవిత భాగస్వామికి పెన్షన్ వస్తుందన్నారు. జిల్లాలో ఒక లక్షా 91 వేల 691 మంది లబ్ధిదారులకు ఆసరా పెన్షన్లు క్రింద ప్రతి నెల 44 కోట్ల 48 లక్షల నిధులు అందిస్తున్నామని అన్నారు. వీరిలో 28 వేల 966 మంది దివ్యాంగులు పెన్షన్ పొందుతున్నారని, వారికి ప్రభుత్వం వెయ్యి రూపాయల పెన్షన్ పెంచి జూలై మాసం నుంచి 4016 రూపాయల పెన్షన్ అందిస్తుందని తెలిపారు. దివ్యాంగుల పెన్షన్ క్రింద ప్రతి నెల రూ. 11 కోట్ల 51 లక్షలు అందిస్తున్నమన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రతినెల సదరం క్యాంపులు నిర్వహిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా ఆసరా పెన్షన్ అందించే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం చైర్మన్ దివ్యాంగులకు పెన్షన్ పెంపు ప్రొసీడింగ్స్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు ,బిఆర్ఎస్ పార్టీ నాయకులు మున్సిపాలిటీ చైర్మన్ మొండితోక లత , ఏఎంసీ చైర్మన్ బంధం శ్రీనివాస్ రావు , రైతు సమన్వయ సమితి జిల్లా నల్లమల వెంకటేశ్వర్లు ,మండలాల నుండి వచ్చిన జడ్పిటిసిలు ,ఎంపీపీలు, రైతు సమన్వయ సమితి సభ్యులు ,కౌన్సిలర్లు మున్సిపాలిటీ కమిషనర్ అంబటి రమాదేవి, ఎంపీడీవో ఎస్కే సాలార్ సాహెబ్ మరియు అధికారులు, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రాష్ట్ర ప్రజల సంక్షేమమేకేసీఆర్ లక్ష్యం

## వికలాంగుల పెన్షన్ ఉత్తర్వులు అందజేసిన ఎంఎల్ఏ మెచ్చా



**దమ్మపేట, ఆగష్టు 24(మనం న్యూస్):** రాష్ట్ర ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని అశ్వారావుపేట ఎంఎల్ఏ మెచ్చా నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం అశ్వారావుపేట గిరిజన భవన్ లో 2724 మంది వికలాంగులకు 1కోటి 9లక్షలు పెన్షన్, 64 కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ఇప్పటికే 3016 రూపాయలను వికలాంగులకు ఇస్తుండగా వారికి మరో 1000/- రూ పెంచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు,వైస్ ఎంపీపీలు,ఎంపీటీసీ లు,సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,యువకులు పాల్గొన్నారు. దమ్మపేట మండలంలో 751, అశ్వారావుపేట మండలంలో 752, ములకలపల్లి మండలంలో 439,అన్నపురెడ్డిపల్లి మండలంలో 260, చంద్రుగొండ మండలంలో 522నియోజకవర్గం మొత్తం 2724 మంది దివ్యాంగ పెన్షన్‌దారులు ఉన్నట్లు తెలిపారు.

# అమ్మ నాన్న వృద్ధాశ్రమాన్ని సందర్శించిన మణుగూరు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి



**మణుగూరు, ఆగస్టు 24 (మనం న్యూస్)** : నేను సైతం సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్ ద్వారా వృద్ధాశ్రమం నెలకొల్పి నిర్వహిస్తూ ఉన్న తారప్రసాద్ సేవలు ప్రశంసనీయమని, కుటుంబ సభ్యుల ఆధరణ కరువై అనాథలుగా మారీ, ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్న వారిని ప్రతీ ఒక్కరూ అక్కున చేర్చుకోవాలి మణుగూరు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి పేర్కొన్నారు. మణుగూరు మండలం, ఉడతనేనీ నగర్ గ్రామం నందు, నేను సైతం సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య. తారప్రసాద్ దంపతులు నెలకొల్పి నిర్వహిస్తున్న అమ్మ నాన్న వృద్ధాశ్రమం ను, జాతీయ వయో వృద్ధుల (సీనియర్ సిటిజన్) దినోత్సవం ను పురస్కరించుకొని, మండల న్యాయ సేవ సాధికార సంస్థ ఆద్వర్యంలో సందర్శించారు. వృద్ధుల యోగ క్షేమాలు, కుటుంబ నేపథ్యం, వృద్ధాశ్రమం నందు కల్పిస్తున్న సేవలు తదితర అంశాలపై వృద్ధులతో ప్రేమ ఆప్యాయత అనురాగ పూర్వకముగా పలకరించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మేదరమెట్ల శ్రీనివాస రావు, సభ్యులు అమృత లూరి. రామ మోహన్ రావు, పోషం. భాస్కర్ రావు, మధుసూధన్ రావు, అంకం. సర్వేశ్వరా రావు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# టికెట్ ఎవరికి వచ్చినా కలిసికట్టుగా పని చేయాలి...

## మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు..

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 24( మనం న్యూస్ ):** మండల కేంద్రంలో అంకమ్మ తల్లి ఆలయ సన్నిధిలో గురువారం మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో వర్గ భేదాలు లేకుండా ఎవరికి టికెట్ వచ్చినా అందరూ కలిసికట్టుగా ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించుకోవాలని, ఈ మూడు నెలల్లో గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. అధికారంలోకి రాగానే రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్లు ఇస్తామని, వృద్ధులకు, వికలాంగులకు, కులవృత్తులకు 4000 రూపాయల పెన్షన్ ఇస్తామని, ఉపాధి కూలీలకు, రైతు కూలీలకు 12 వేల రూపాయలు ఆర్థిక సహాయం, రైతుల పాలిట శాపంగా మారిన ధరణి పోర్టల్ ని రద్దు చేస్తామని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోని వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వెంకటరెడ్డి, నల్లమోతు రవణ, చెరుకూరు రవి, దాసుపాటి రాంబాబు, కుంజ శ్రీను, పెద్దరపు నాగరాజు, కాలోజీ నరసింహ, కనపర్తి కళాధర్, పాల్గొన్నారు.

# దివ్యాంగులను స్వశక్తులను చేసేందుకు పించన్ల పెంపు

(మొదటి పేజీ తరువాయి)

శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరావు , హరిప్రియ , గ్రంధాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్ , రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు రావు జోగేశ్వరావు , జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్రావు , కొత్తగూడెం , ఇల్లందు మున్సిపల్ చైర్మన్లు కాపు సీతాలక్ష్మి , డి వెంకటేశ్వర్లు , అదనపు కలెక్టర్లు రాంబాబు , డిఆర్డిఓ మధుసూదన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

**రూ.135 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

75 సంవత్సరాలలో రూ.75 కోట్లతో అభివృద్ధి పనుల కోసం కేటాయించిన సందర్భాలు లేవని తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగాకొత్తగూడెం జిల్లా కేంద్రం, రామవరం, పాల్వంచ లో పలు అభివృద్ధి పనులకు కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పాల్వంచలో రూ.60కోట్లు, కొత్తగూడెంకు రూ.75.25కోట్లు మొత్తం 135.25కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందని మంత్రి పువ్వాడ తెలిపారు. కొత్తగూడెం అభివృద్ధి జరగాలంటే ఇక్కడ మళ్ళీ వనమాను గెలిపించాలని, బిఆర్ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టాలని పువ్వాడ ప్రజలను కోరారు. కొత్తగూడెం జిల్లా కేంద్రం పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో కొత్తగూడెం పురపాలక సంఘం పరిధిలో 1వ వార్డు నుండి 36వ వార్డులలో డిఎంఎఫ్ నిధులతో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనుల పైలాన్ ను ఆవిష్కరించారు. కొత్తగూడెం పురపాలక సంఘం పరిధిలోని 6వ వార్డులో నిర్మించనున్న మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.కొత్తగూడెం పురపాలక సంఘం పరిధిలోని 36వ వార్డు స్టేషన్ రోడ్ నందు ఆంధ్ర బ్యాంక్ నుండి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వరకు చేపట్టనున్న రోడ్డు అభివృద్ధి మరియు రోడ్డు వెడల్పు పనులకు శంకుస్థాపన చేశారు.పాల్వంచ పట్టణ కేంద్రం నవభారత్ వద్ద రూ.60కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనుల పైలాన్ ను మంత్రి పువ్వాడ శంకుస్థాపన చేశారు.

# బిసి లబ్ధిదారుల చెక్కుల

(మొదటి పేజీ తరువాయి)

కూడా భద్రాచలం ఆర్డీవో ఆఫీస్ లో చేరుకోవడంతో మరింత ఉద్రిక్తత ఏర్పడింది. ఒకవైపు పోలీసులు చెబుతున్న వినకుండా నినాదాలు చేసుకుంటూ పోటాపోటీగా గొడవకు దిగడంతో కొంతసేపు కార్యక్రమాన్ని నిలిపివేశారు. ఇద్దరికి ఎంఎల్సి తాతా మధు సర్ది చెప్పారు.

# సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలి

(మొదటి పేజీ తరువాయి)

నమోదయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. నమోదుకు 19 సెప్టెంబర్ వరకు అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో 1439 ఉన్న పోలింగ్ కేంద్రాలు, 1455 కి పెంచడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీలు తమ తమ బూత్ లెవల్ ఏజెంట్/బాధ్యుల జాబితా సమర్పించాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్/బాధ్యులతో బూత్ లెవల్ అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు వెళతారన్నారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ ఇచ్చినప్పటి నుండే స్పెషల్ సమ్మరి రివిజన్ ప్రారంభం అయిందని ఆయన తెలిపారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రదర్శించినట్లు ఆయన అన్నారు. అడ్రస్ మార్పు, చనిపోయిన, షిఫ్ట్ అయిన, డూప్లికేట్ ఓటర్ల విషయంలో సంబంధిత ఫారాల్లో దరఖాస్తు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. దర్ఖాస్తులు ఆన్లైన్ లోనే చేపట్టాలని, ఆన్లైన్ వెబ్ సైట్, యాప్ లపై కలెక్టర్ అవగాహన కల్పించారు. శని, ఆదివారాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టనున్నట్లు, ఆ రోజుల్లో బూత్ లెవల్ అధికారులు, సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని, ఓటరుగా పేరు ఉందో లేదో చూసుకోవడం, లేకుంటే వెంటనే నమోదు చేసుకోవడం, సమస్యలు ఉంటే దృష్టికి తేవడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జెడ్పి సిఇఓ అప్పారావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాంబాబు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి నల్లమోతు తిరుమల రావు, బిజెపి పార్టీ ప్రతినిధి జివిఎస్ఆర్ఏ. విద్యాసాగర్, సిపిఐ(యం) పార్టీ ప్రతినిధి పొన్నం వెంకటేశ్వర రావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి నల్లమల సత్యంబాబు, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి లింగబోయిన సతీష్, టిడిపి పార్టీ ప్రతినిది కె. కరుణాకర్, అధికారులు, పాల్గొన్నారు.

# వినియోగదారుల కోరిక మేరకు అందుబాటులోకి బిఎస్ 4 గ్లామర్ వాహనం

## – తొలి వాహనం రాముల వారికి బహుకరణ



**భద్రాచలం, ఆగస్టు 24 (మనం న్యూస్) :** వినియోగదారుల, ఆదరాభిమానాలు సంపాదించుకున్న హీరో గ్లామర్ వాహనాన్ని మళ్లీ అందుబాటులోకి తెచ్చినట్టు శ్రీ రామ్ హీరో షోరూం నిర్వాహకులు భరత్ తెలిపారు. ఈ మేరకు గురువారం షోరూం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో డిప్యూటీ జోనల్ మేనేజర్ లక్ష్మి షా, తెలంగాణ ఏరియా మేనేజర్ మనీష్ జైన్, తెలంగాణ హెడ్ వినీత్, టీఎస్ మేనేజర్ కరణ్ తో కలిసి ఆయన మాట్లాడారు. వినియోగదారుల కోరిక మేరకు పాత మోడల్ మక్కువతో అదే మోడల్ వాహనం కావాలని కోరుతున్నారని చెప్పారు. వినియోగదారుల కోరిక మేరకు పొల్యూషన్, యూఎస్బీ ఛార్జింగ్ వంటివి ఆధునికరించి నేడు దేశవ్యాప్తంగా హీరో గ్లామర్ వాహనాన్ని సంస్థ తిరిగి ప్రారంభిస్తుందని చెప్పారు. ఇందులో భాగంగా గురువారం ముందుగా భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి ఒక వాహనాన్ని బహుకరించినట్లు చెప్పారు. షోరూమ్ ధర్శ.81,200గా ఉంటుందని, హీరో షోరూం నిర్వాహకులు తెలిపారు. వినియోగదారులు అందుబాటులోకి వచ్చిన అభిమాన గ్లామర్ వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఇంటింటి సర్వేలో ఓటర్ల నమోదు పక్కాగా చేపట్టాలి...

## కలెక్టర్ శశాంక



**మహబూబాబాద్, ఆగస్టు, 24(మనం ప్రతినిధి):** ఇంటింటి సర్వేలో ఓటర్ల నమోదు పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు. గురువారం ఐ.డి.ఓ.సి.లోని కాన్ఫరెన్స్ హాల్ లోఓటర్ల జాబితా పై పోలింగ్ స్టేషన్ల వారీగా అదనపు కలెక్టర్ డేవిడ్ తో కలిసి బి ఎల్ వో ల తో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఇంటింటి సర్వేలో ఓటర్ల నమోదు పక్కాగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ఇంటినెంబర్ లేని ఇండ్లల్లో ఉన్న ఓటర్లు నమోదు కొరకు పక్క ఇంటి నెంబర్తో నమోదు చేయాలన్నారు.మృతుల ఓటర్ల తొలగింపులో మరణ ధ్రువీకరణ పత్రము ప్రాతిపదిక కాదని తెలియజేశారు.ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 ఓట్ల నుండి 1000ఓట్ల వరకు నమోదయి ఉంటారని వారిలో కనీసం 30 మంది అయిన 18 సంవత్సరముల వాళ్లు ఓటరుగా నమోదై కనిపించాలన్నారు.జిల్లాలో గూడూరు మండలం ఊట్ల గ్రామం కేసముద్రం మండలం ఇనుగుర్తి ,అప్పరాజుపల్లి , చిన్న ముప్పారం లోని పెద్ద తండా నెల్లికుదురు మండలంలోని నైనాల మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జంగిలిగొండ మాదాపురం ఇస్లావత్ తండా ఉన్నాయని 18 సంవత్సరంలో ఓటర్లు నమోదును పక్కాగా చేపట్టాలన్నారు.ప్రతి పోలింగ్ స్టేషన్లో పరిధిలోని 250 కుటుంబాలకు సుమారు 800 ఓట్లు పైగా ఉంటాయని ప్రతి ఓటు వివరాలు బిఎల్ఓ దగ్గర తప్పనిసరిగా ఉండాలన్నారు.దివ్యాంగుల ఓటర్లను గుర్తించాలని పోస్టల్ బ్యాలెట్కు వారు దరఖాస్తు చేసినప్పుడు సదరు దరఖాస్తు పేరు ఓటర్ల లిస్టులో తప్పనిసరిగా ఉండి తీరాలన్నారు ఈనెల 21 నుండి సెప్టెంబర్ 19వ తేదీ వరకు నెలరోజుల కాలపరిమితి ఉన్నందున ఇంటింటి ఓటర్ నమోదు సర్వే పక్కాగా చేపట్టలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్ జిల్లా అధికారులు హైమావతి నర్మద తాసిల్దార్లు ఎంపీడీవోలు బిఎల్ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినచర్యలు

## ఎస్పీ శరత్ చంద్ర పవార్




**మహబూబాబాద్, ఆగస్టు 24(మనం ప్రతినిధి):** చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠినచర్యలు తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ అన్నారు. గురువారంనాడు మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపిఎస్ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ...నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేసి భాదితులకు న్యాయం చేకూర్చే విధంగా పోలీసు అధికారులందరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం పెండింగ్లో ఉన్న పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్ ద్వారా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు.గంజాయి రవాణా, మట్కా, బెట్టింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ముందస్తుగా వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.షీ టీమ్స్ ఆవశ్యకత గురించి జిల్లా వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలియజేసారు.స్థానికంగా పోలీస్ అధికారులు తమ తమ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని నిరంతరం సందర్శిస్తూ ఉండాలని,ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టి పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింతగా పెంచాలని కోరారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ జో చెన్నయ్య, తొర్రూరు డిఎస్పీ వెంకటేశ్వర బాబు, సీసీఎస్ డిఎస్పీ మోహన్, జిల్లాలోని సిఐలు,ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.

# ములుగు జిల్లా వరద బాధితులకు 'బయ్యారం మిత్ర బృందం' చేయూత





**బయ్యారం ఆగస్టు 24(మనం న్యూస్):** ములుగు జిల్లాలో కురిసినటువంటి భారీ వర్షాలకు కొన్ని ప్రాంతాలు మొత్తం ముంపునకు గురై ఇల్లు కూలిపోయి ఉండడానికి ఎటువంటి వసతి లేక తినడానికి తిండి లేని ప్రజల పరిస్థితిని చూసి చెలించిన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలానికి చెందినటువంటి కొందరూ యువకులు 'బయ్యారం మిత్రబృందం' పేరుతో గురువారం ములుగు జిల్లా ఏటూరి నాగారం మండల కేంద్రంలో కొండాయి, చింతల్ పాడు పరిధి ఎంపీటీసీ దేవేందర్ ఆధ్వర్యంలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు 60 బస్తాల బియ్యాన్ని, 60 కేజీలా మంచి నూనే, 60 కేజీలు కందిపప్పు, 60 కేజీలు ఉప్పు పాకెట్స్, 60 కేజీల ఉల్లిగడ్డలు,60 కేజీల ఉప్మా రవ్వ, 60 సేమియా పాకెట్స్ అందించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి దేవేందర్ మాట్లాడుతూ బయ్యారం మిత్ర బృందం సభ్యులు గత మూడు సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు అందులో భాగమే ఈ రోజు ములుగు వరద బాధితులకు లక్ష రూపాయల విలువగల రైస్ బ్యాగ్ లు నిత్యావసర వస్తువులు అందించినందుకు బయ్యారం మిత్ర బృందానికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. కార్యక్రమంలోమిత్ర బృందం సభ్యులు తుడుం రాజేష్, చల్లా గోవర్ధన్, కొమిరె జనార్దన్, శెట్టి థామస్, మందుల గణేష్, ఎచ్చు రమేష్, జినక లక్ష్మణ్, చంటి,సోమవరపు రవి, మంద ఉమేష్, పోతురాజు రాజశేఖర్, మరికంటి నరేష్, పోతురాజు కృష్ణ, మట్టే రాజేష్,బానోత్ దేవేందర్ నాయక్, మబ్బు ప్రశాంత్, నందిపాటి సురేష్,కేదాస్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు...

# 28న మొబైల్ ఎగ్జిబిషన్

**మహబూబాబాద్ ఆగస్టు 24 (మనం న్యూస్):** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళ బీ ఫార్మసీ కళాశాల అనంతరం రోడ్డులో మొబైల్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంటర్ ఫర్ సెల్యూలర్ మాలిక్యులర్ బయాలజీ( సిపిఎంబి) హైదరాబాద్, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజికల్ మ్యూజియం బెంగళూరు వారి సౌజన్యంతో జన్యు ఆరోగ్య సంధానం సంచార విజ్ఞాన ప్రదర్శన ఈనెల 28 నుండి 30 వరకు అనంతరం ప్రభుత్వ మహిళ బీఫార్మసీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎగ్జిబిషన్లో తిలకించేందుకు వివిధ ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు విద్యార్థినిలు తొమ్మిదవ పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు సందర్శించి తిలకించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేయాలి

## కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు దికొండ శ్రీనివాస్

## వెలికట్ట కాంగ్రెస్ అధ్యక్షునిగా దేవేందర్ రాజు



**తొర్రూరు, ఆగస్టు 24 (మనం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేయాలని కాంగ్రెస్ బిసి సెల్ తొర్రూరు మండల అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని వెలికట్ట గ్రామంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం బీసీ సెల్ మండల అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించి గ్రామ కాంగ్రెస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులుగా ప్రతి కంఠం దేవేందర్ రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలుగా దీకొండ రాధిక, యూత్ విభాగం అధ్యక్షులు వీరమనేని రమేష్,పార్టీ ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ రాజ్ కుమార్, కోశాధికారిగా శామకూరి ఉప్పలయ్య, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ను క్షేత్రస్థాయిలో పటిష్టం చేయడంలో గ్రామ కమిటీల పాత్ర కీలకమని, వెలికట్టలో పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేవరకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కోరారు. పాలకుర్తిలో కాంగ్రెస్ ఎగరవేస్తామన్నారు. నియామకానికి సహకరించిన మండల నాయకులకు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్ రెడ్డి, కళావతి, సోమ సత్తయ్య చారి, పబ్బాల రాము, దీకొండ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# రెండవ విడత దళిత బందు పథకమును వేగవంతం చేయాలి...కలెక్టర్



**మహబూబాబాద్, ఆగస్టు 24(మనం ప్రతినిధి):** జిల్లాలో రెండో విడత దళిత బంధు పథకమును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు.గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో రెండో విడత దళిత బంధు పథకం పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దళిత బంధు పథకానికి అర్హులు అయిన వారిని త్వరితగతిన గుర్తించాలన్నారు.మండలాల వారీగా లబ్ధిదారుల నివేదిక రూపొందించి ఆయా నియోజకవర్గాల శాసనసభ్యుల దృష్టికి తీసుకువెళ్లాలని శాసనసభ్యుల పరిశీలన అనంతరం అర్హులైన వారి నివేదిక ఇవ్వాలన్నారు.నివేదిక సాధ్యమైనంత త్వరగా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారి సన్యాసయ్య, షెడ్యూల్ కులాల కార్పొరేషన్ అధికారి బాలరాజు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## –ఒడిశా రాష్ట్ర శాసనసభ్యులు భుదాన్ మూర్మ

**కురవి, ఆగస్టు 24 (మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీని బలోపేతం చేయాలని ఒరిస్సా రాష్ట్రం సరస్కోన శాసనసభ్యులు భూదాన్ ముర్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోనికొలువై ఉన్న భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం బిజెపి ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమం మండల అధ్యక్షులు రామోజీ నాగరాజు అధ్యక్షతన నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి కార్యకర్త బూతు అధ్యక్షులను కలిసి గ్రామాల్లో పార్టీ అభివృద్ధి కోసం బలోపేతం చేసి పార్టీ గెలుపుకు కృషి చేయాలని సూచించారు. ప్రధానమంత్రి మోడీ ప్రజల కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని , కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల పట్ల ప్రజల కు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా కార్యవర్గ సభ్యులు గుగులోతు దేవిక, డోర్నకల్ నియోజకవర్గ నాయకులు బానోత్ ప్రభాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్, కొనతం పెంటయ్య,నరసింగం అశోక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.